

సుధేష్ణ సేన్‌కి పుష్ప గుచ్ఛం అందజేస్తున్న పూర్వ డీఆర్ఎం రామకృష్ణ



డీఆర్ఎంగా సుధేష్ణ సేన్ బాధ్యతల స్వీకారం

7



- అటెండెన్స్ మార్కింగ్ చేయని సచివాలయాల ఉద్యోగులు
- 3 జిల్లాల ఉద్యోగులది ఇదే తీరు
- అదేమని ప్రశ్నిస్తే కుంటి సాకులు
- రాష్ట్ర ప్రభుత్వం నిర్దిష్ట ఆదేశాలు

హాజరు ఉంటేనే.. జీతాలు



గుంటూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): గ్రామ/వార్డు సచివాలయాల ఉద్యోగుల్లో ఇంకా కొంత మందిలో నిర్లక్ష్య ధోరణి పోవడం లేదు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన ఈ వ్యవస్థలో నియమితులైన ఉద్యోగులు తాము ప్రత్యేకమన్న రీతిలో వ్యవహరించే వారు. వివిద ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగుల ఆదేశాలు ఖాతరు చేసే వాళ్లు కాదు. నేటికీ అదే పరిస్థితి కొనసాగుతున్నది. సచివాలయాల ఉద్యోగులంతా హ్యూమన్ రిసోర్సు మేనేజ్‌మెంట్ సిస్టమ్ పోర్టల్/యాప్‌లో లాగిన్ అయి తప్పక ఇన్ వార్డు, అవుట్‌వార్డు హాజరుని మార్కింగ్ చేయాలని పదేపదే ప్రభుత్వం ఆదేశిస్తున్నా కొందరిలో ఏ మాత్రం మార్పు రావడం లేదు. ఏవేవో కుంటిసాకులు చెబుతూ హాజరు వేయకుండా జీతాలు డ్రా చేస్తున్నారు. దీని వలన సర్వీసు డెలివరీ, ప్రభుత్వ లక్ష్యాలను అధిగమించడంలో ఇబ్బందులు తలెత్తు తుండటంతో ఇక నుంచి ఈ విషయంలో కఠినంగా వ్యవహరించాలని మూడు జిల్లాల కలెక్టర్లను రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది.

సచివాలయాల వ్యవస్థ ఏర్పాటైన తర్వాత 2021వ సంవత్సరం ఫిబ్రవరి నాల్గో తేదీన రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఒక్క ఉద్యోగి బయోమెట్రిక్ అటెండెన్స్ తప్పక రోజుకు రెండు సార్లు వేయాలని ఆదేశించింది. ఆ తర్వాత ప్రభుత్వం హెచ్ఆర్ఎంఎస్ యాప్‌ని ప్రతి ఒక్క ఉద్యోగికి తీసుకొచ్చింది. ఇది జియో కో-ఆర్డినేట్స్ ఆధారంగా అటెండెన్స్‌ని మార్కింగ్ చేస్తుంది. ఉద్యోగి సంబంధిత సచివాలయానికి 300 మీటర్ల లోపు ఉంటే అటెండెన్స్ మార్కింగ్ అవుతుంది. ప్రతి ఒక్క ఉద్యోగికి జాబ్ చార్ట్ ప్రకారం ఇన్‌వార్డు, అవుట్‌వార్డు టైమింగ్స్ ఉన్నాయి. అయినప్పటికి కొందరు నిర్లక్ష్య ధోరణితో ఉంటూ సమయానికి వచ్చి అటెండెన్స్‌ని మార్కింగ్ చేయకుండా లేటుగా వస్తున్నారు. కొందరైతే సాయంత్రం వచ్చి ఇన్ వార్డు, అవుట్‌వార్డు రెండూ ఒకే సారి నిమిషాల వ్యవధిలో మార్కింగ్ చేస్తున్నారు. అదేమంటే తాము ఫీల్డ్‌లో ఉన్నామని, ఫలాన అధికారి పని చెప్పారని, పింఛన్ల పంపిణీ ఆలస్యమైందని వంటి ఏవేవో కారణాలు చెబుతున్నారు.

■ గుంటూరు జిల్లాలో 568 గ్రామ/వార్డు సచివాలయాలుండగా 4806 మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. వీళ్లలో 3696 మంది హెచ్ఆర్ ఎంఎస్ పోర్టల్‌లో అటెండెన్స్‌ని సక్రమంగా మార్కిం గ్ చేస్తున్నారు. 1109(23 శాతం) మంది అటెండెన్స్‌ని మార్క్ చేయడం లేదు. బాపట్ల జిల్లాలో 477 సచివాలయాలుంటే 4,259 మంది విధులు నిర్వహిస్తున్నారు. వీళ్లలో 3182 మంది హాజరు వేస్తు న్నారు. 1077 (25 శాతం) మంది పోర్టల్/యాప్‌లో హాజరు మార్క్ చేయడం లేదని తేలింది. పల్నాడు జిల్లాలో 538 సచివాలయంటే 4456 మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. అయితే వీళ్లలో 3536 మంది మాత్రమే నిత్యం హాజరుని మార్కింగ్ చేస్తున్నారు. 920(21 శాతం) మంది హాజరుకు దూరంగా ఉంటున్నారు.

ఈ నేపథ్యంలో కీ పెర్‌ఫార్మెన్స్ ఇండికేటర్స్(కేపీఐ)లను సక్రమంగా పర్యవేక్షించ లేని పరిస్థితి ఉత్పన్నమవుతున్నది. ముఖ్యంగా ప్రజలకు సర్వీసు డెలివరీ సకాలంలో చేయ లేని పరిస్థితి ఏర్పడుతున్నది. ఈ కారణాలతో హెచ్ఆర్ఎం పోర్టల్‌లో అటెండెన్స్ వేస్తేనే జీతాలు విడుదల చేయాల్సిందిగా ప్రభుత్వం ఆదేశించింది. ఈ విషయంలో మూడు జిల్లాల కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ వహించి తరచుగా సమీక్షించాలని సూచించింది. అలానే గుంటూరు జిల్లాలో 86, బాపట్లలో 56, పల్నాడులో ఏడుగురు సచివాలయాల ఉద్యోగులను డిప్యూటేషన్‌పై వేరే పనులకు వినియోగిస్తున్నారు. తక్షణమే వాటన్నింటిని రద్దు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఏదైనా విపత్తులు సంభవించినప్పుడు మాత్ర మే అది కూడా ఏడు రోజులకు మించి డిప్యూ టేషన్ చేయొద్దని స్పష్టం చేసింది. సీఆర్‌డీఏకి చేసిన డిప్యూటేషన్లు మినహా మిగిలిన వన్నింటిని రద్దు చేయాల్సిందేనని, సిబ్బంది సచివాలయాల నుంచే విధులు నిర్వహించా లని తేల్చి చెప్పింది.

రబీ ధాన్యం.. సేకరణకు సిద్ధం!



- నేటి నుంచి తెరుచుకోనున్న కొనుగోలు కేంద్రాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- బాపట్ల జిల్లాలో రబీకి 10,000 టన్నుల నుంచి 30,000 వరకు పెంపు
- పల్నాడు జిల్లాలో 10,000 టన్నుల సేకరణకు అనుమతి
- లేట్ ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్ల విషయంలో రాని స్పష్టత

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

రబీ ధాన్యాన్ని మద్దతు ధరకు సేకరించడానికి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మంగళవారం నుంచి జిల్లా వ్యాప్తంగా 42 రైతు సేవా కేంద్రాల్లో కొనుగోళ్లను ప్రారంభించనున్నారు. బాపట్ల జిల్లాకు సంబంధించి రబీ సీజన్‌లో 62,000 మెట్రిక్ టన్నుల వరకు దిగుబడి ఉంటుందనేది అంచనాగా ఉంది. మూడు వారాల క్రితం రబీ సీజన్‌లో 40,000 టన్నుల సేకరణకు అధికారులు ప్రతిపాదనలు పంపంగా 10,000 టన్నులకే గ్రీన్ సిగ్నల్ వచ్చింది. కానీ తాజాగా ఇచ్చిన ఆదేశాలలో ప్రభుత్వం దానిని 30,000 వరకు పెంచింది. పల్నాడు జిల్లాకు వచ్చేసరికి రబీలో 10,000 టన్నుల సేకరణకు అనుమతులు వచ్చాయి. ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసిన ప్రభుత్వం రబీలో కూడా అదే ఒరవడి కొనసాగిస్తామని ధీమాగా చెబుతోంది. 75 కేజీల ధాన్యం బస్తా ధర గ్రేడ్-ఏ రకం మద్దతుధర రూ.1740 ఉండగా, కామన్ రకం రూ.1725గా ఉంది. ప్రస్తుతం బయట మార్కెట్‌లో మద్దతు ధరకన్నా రూ.150 నుంచి రూ.200 తక్కువగా ఉండడంతో రెతుల చూపు కొనుగోలు కేంద్రాల వైపే ఉంది. దీంతో మంగళవారం నుంచి రైతు సేవా కేంద్రాలు వేదికగా కొనుగోళ్లు జరపనుండడంతో రైతులకు మేలు చేకూరనుంది.

ఈ సారి కూడా పెంచక తప్పదా...

ఖరీఫ్ సీజన్‌లో మద్దతు ధరకు ధాన్యం సేకరణ విషయంలో గుంటూరు, పల్నాడు, బాపట్ల మూడు జిల్లాల పరిధిలో తొలుత ఇచ్చిన లక్ష్యం కంటే దశలవారీగా అనుమతులు పెంచుకుంటూ రావాల్సి వచ్చింది. బాపట్ల జిల్లాలో ఖరీఫ్‌కు తొలుత ఇచ్చిన లక్ష్యం 50,000 టన్నులే కాగా అది ముగింపుకొచ్చేసరికి 92,000 టన్నుల వరకు వెళ్లింది. ఖరీఫ్‌లో గుంటూరు, పల్నాడు జిల్లాల్లోనూ అదే పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం గుంటూరు జిల్లాలో రబీ ధాన్యం దిగుబడులు నామమాత్రంగా ఉండడంతో అక్కడ సేకరణ విషయంలో ఇంకా స్పష్టత లేదు. పల్నాడు జిల్లాలోనూ రబీకి సంబంధించి పెద్దగా సమస్యలు ఉత్పన్నం కాకపోవచ్చు కానీ బాపట్ల జిల్లాలో లేట్ ఖరీఫ్ దిగుబడులు దాదాపు 42,000 టన్నుల వరకు ఉండడంతో వాటిని మద్దతు ధరకు కొనే విషయంలో రైతాంగంలో ఆందోళన నెలకొంది.

పెంచింది లేట్ ఖరీఫ్ కోసమేనా..

రబీ సీజన్‌లో బాపట్ల జిల్లాకు తొలుత అనుమతి ఇచ్చింది పది వేల టన్నులే కాగా దానిని ఇప్పుడు 30,000 వరకు పెంచారు. లేట్ ఖరీఫ్‌ను దృష్టిలో పెట్టుకునే ప్రభుత్వం ఈ పెంపు నిర్ణయం తీసుకుందా అనే విషయంలో స్పష్టత లేదు. లేట్ ఖరీఫ్ ధాన్యాన్ని రబీలో కొనడానికి ఉన్న సాంకేతిక ఇబ్బందులను అధికారులు ఇప్పటికే రాష్ట్రస్థాయి కమిషనరేట్ దృష్టికి తీసుకెళ్లిన సంగతి తెలిసిందే. కానీ ఆ చిక్కులను తొలగించే విషయంలో ఇంకా ఓ నిర్ణయానికి రాలేదనేది సమాచారం.

ఏప్రిల్ చివరి వారంలో కానీ...

గత ప్రభుత్వంలో రబీ సీజన్ ధాన్యం సేకరణ విషయంలో ఏప్రిల్ చివరి వారంలో కానీ కదలిక మొదలయ్యేది కాదని, ఈ సారి ఏప్రిల్ రెండో వారంలోనే కొనుగోలు కేంద్రాలు తెరవడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇదే కాకుండా తొలుత వచ్చిన అనుమతులతోనే సరిపెట్టకుండా రైతుల అభ్యర్థనల మేరకు పలు దఫాలుగా అధికారులు ప్రతిపాదనలు పంపి నేతల సహకారంతో వాటిని సాధించుకోవడం కూడా అన్నదాతలకు మేలు చేకూరుతోంది.

గోనె సంచులు..జీపీఎస్ వాహనాలు

రైతాంగం ప్రయోజనాలు దెబ్బ తీసే విధంగా మిల్లర్లు వ్యవహరిస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఖరీఫ్ సీజన్‌లో గట్టిహెచ్చరికలనే ప్రభుత్వం పంపించ గలిగింది. క్రమం తప్పకుండా తనిఖీలు చేపట్టడంతో చాలా వరకు మిల్లర్ల మాయాజాలానికి అడ్డుకట్ట వేయగలిగారు. ఖరీఫ్‌లో గోనె సంచుల సమస్య ఉత్పన్నమయింది. దీంతో రబీలో ముందుగానే బ్యాగులను పెద్ద ఎత్తున సంచులను సిద్ధం చేశారు. ధాన్యం తరలించే వాహనాలకు జీపీఎస్ ఏర్పాటు చేసే వ్యవస్థతో పాటు అన్ని ఏర్పాట్లను యంత్రాంగం పూర్తి చేసింది. ప్రభుత్వం నిర్దేశించిన మద్దతు ధరకే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, ఈ విషయంలో ఎవరైనా మిల్లర్లు ఉల్లంఘనలకు పాల్పడితే వారిపై చర్యలు తప్పవని ఇప్పటికే అధికారులు హెచ్చరించారు.

ఆ దర్యాప్తులు.. అంతేనా

- నోటీసులు, విచారణలంటూ హడావుడి
- నిగ్గు తేల్చిందే లేదు.... చర్యల ఊసే కరువు
- కీలకమైన కేసుల్లోనూ తాత్సారమే
- పంచాయతీ, రెవెన్యూ విభాగాల్లోనే దాదాపు 115 విచారణలు!

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ఏ ఒక్క విభాగాన్ని వదిలిపెట్టకుండా అందినకాడికి వైసీపీ నేతాగణంతో కలిసి కొంతమంది ఉద్యోగులు దండుకున్నారు. ఇష్టారీతిన అనధికార కట్టడాలకు అనుమతులు, అసైన్డ్ భూముల్లో రిసార్టుల పర్వమయితే ఆకాశమే హద్దుగా సాగింది. మెప్మా, పంచాయతీ, డ్వామా వంటి విభాగాల్లో వెలుగుచూ సిన అక్రమార్కుల లీలలు అన్నీఇన్నీ కావు. తహసీల్దార్ల కార్యాలయాలే అడ్డాగా చేసుకుని వైసీపీ నాయకులు సాగించిన భూదందాలకు కొదవలేదు. ఇలా ఒకటేమిటి అన్ని చోట్లా ఇదేతంతు. నిబంధనలను కాలరాస్తూ తిలాపాపం తలాపిడికెడు అన్న చందాన అందరూ పంచుకున్నారు. వీటన్నింటిపై నూతన ప్రభుత్వంలో విచార ణలు ఉంటాయని ఆర్భాటపు మాటలు కాకుండా కఠినచర్య లకు దిగుతుందని బాధితులతో పాటు సామాన్య ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. అలాంటిదేమి జరగకపోగా నోటీసులు, విచారణలు, దర్యాప్తులంటూ హడావిడి తప్ప తీసుకున్న చర్యలు శూన్యం. గత ప్రభుత్వం వారసత్వంగా ఇచ్చిన అవినీతి బాగోతాలపై దర్యాప్తులు నత్తనడకన సాగుతుండడం ఒక ఎత్తయితే డ్రగ్స్ దందా వంటి కీలక కేసుల్లో దర్యాప్తు పురోగతి లేకపోవడం మరింతగా కలవరపరుస్తోంది

పంచాయతీలను ఊడ్చేశారు.....రెవెన్యూది అదేదారి

ప్రభుత్వం మారగానే గత ఏలుబడిలో జరిగిన అనేక అక్రమాలపై ఒక్క పంచాయతీ, రెవెన్యూ విభాగాల్లోనే దాదా పు 115 వరకు నోటీసులు జారీ చేసి విచారణకు ఆదేశిం చినట్లు తెలుస్తోంది. పంచాయతీల్లో జరిగిన లీలయితే అన్నీ ఇన్నీ కావు. అధికార బలంలో నాలుగు పంచాయతీలకు చెం దాల్సిన నిధులు ఒకే పంచాయతీకి మళ్లించడం మొదలుకుని పర్చూరు నియోజకవర్గం కుంకలమర్రు గ్రామంలో విద్యుత్ బిల్లుల విషయంలో జరిగిన గోల్‌మాల్ వరకు దాదాపు 55 విచారణలను ఒక్క పంచాయతీ విభాగంలోనే ఆదేశించారు. ఫ్రీ హోల్డ్‌తో పాటు నిబంధనలకు విరుద్ధంగా జరిగిన రిజిస్ట్రేషన్ విషయంలో జిల్లాలో దాదాపు 60 వరకు మండల స్థాయిలో విచారణలు సాగుతున్నాయి.



అక్రమాలపై విచారణ ఎదుర్కొంటున్న కుంకలమర్రు గ్రామ పంచాయతీ

అసైన్డ్ చెరబట్టారు...దర్జాగా వ్యాపారం చేస్తున్నారు

తీర ప్రాంతంలో అసైన్డ్ భూములను చెరబట్టి రిసార్టులు కట్టి దర్జాగా సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులకు ప్రస్తుత ప్రభుత్వంలో కళ్లెం పడుతుందని అందూ భావించారు. అయితే ఈ ప్రభుత్వంలో కూడా నోటీసుల జారీతో సరిపెట్టారు తప్పితే ఇప్పటి వరకు ఒక్క అనధికార రిసార్టుపై చర్యలు తీసుకున్న దాఖలాలే లేవు. ఎస్టీలు వేసుకున్న గుడిసెలనే అడ్డగోలుగా గత ప్రభుత్వంలో కూల్చివేయడం వెనక అసైన్డ్ మాఫియా హస్తం ఉందనే ఆరోపణలు అప్పట్లో వచ్చాయి. తీర ప్రాంతంలో దాదాపుగా 18 వరకు అక్రమ రిసార్టు కట్టడాలు ఉన్నాయని తేల్చిన అధికారులు వాటికి మొక్కుబడిగా నోటీసులు జారీ చేయడంతో సరిపెటారు తప్ప, చర్యల విషయంలో అడుగు ముందుకు పడిన దాఖలాలు లేవు. అక్రమార్కులు సొమ్ము చేసుకుంటుంటే వారికి సహకరించిన ఉద్యోగులు యథాస్థానాల్లో విధులు నిర్వహిస్తూ తమను ఎవరేం చేయలేరన్న ధీమాను వ్యక్తబరచడం గమనార్హం

ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు దాదాపు 80 మంది

ఇటీవల జరిగిన బదిలీల్లో జిల్లాస్థాయి అధికారు లు మాత్రమే పెద్ద ఎత్తున జరిగాయి తప్పితే కింది స్థాయి సిబ్బంది విషయంలో పెద్దగా చేర్పులు మార్పులు జరగలేదు. గత ప్రభుత్వంతో అంటకాగిన వారు సైతం ఇప్పుడు కూడా చోటా మోటా నాయకులు అండతో అదే స్థానాల్లో కొనసాగడమో లేక పక్క మండలానికి మారడమో జరిగిందే తప్ప వారు చేసిన తప్పుల విషయంలో చర్యలు అనేవే లేకుండా పోయా యి. పలు ఆరోపణలకు సంబంధించి జిల్లాలో కిందిస్థాయి ఉద్యోగులకు సంబంధించి దాదాపు 80 మంది నోటీసులు అందుకోవడమో లేక విచారణలో భాగంగా వారి పేరు చేర్చడమో జరిగింది.

ఇప్పుడూ అదే దారి...

గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలకు సంబంధించి జరుగుతున్న దర్యాప్తులు ఆ రీతిన ఉంటే ఈ ప్రభుత్వం కొలువుదీరాక కూడా కొన్ని కీలక కేసుల విషయంలో అదే రీతిన తాత్సారం జరగడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల బాపట్ల రూరల్ పరిధిలో మత్తు అవశేషాలు కలిగిన డ్రగ్స్ మాత్రలు దొరికినట్లు సదరు విభాగం ప్రాథమికంగా నిర్ధారించింది. ఘటన జరిగి దాదాపు మూడు వారాలు కావొస్తోంది ఇప్పటికీ ఆ దర్యాప్తు ఏ దశలో ఉందనేది ఎవరికీ అంతుబట్టని విషయంగా ఉంది. రేషన్ మాఫియాకు సంబంధించి పదేపదే 6ఏ కేసుల్లో పట్టుబడిన వివరాలు సేకరించి తీవ్రత కలిగిన కేసుల్లో పీడీయాక్టు అస్త్రం ప్రయోగిస్తామని ఈ ప్రభుత్వంలోనే చెప్పారు. కానీ ఇంతవరకు పదేపదే పట్టుబడుతున్న 6ఏ కేసులపై దర్యాప్తు జరిపిందీ లేదు, పీడీ యాక్టు పెట్టిందీ లేకపోవడం గమనార్హం.

కానిస్టేబుల్ ఆత్మహత్య

- వేరుగా ఉంటున్న దంపతులు
- భరణం కోసం కోర్టును ఆశ్రయించిన భార్య
- కోర్టుకు హాజరవ్వాల్సిన రోజే బలవన్మరణం



కానిస్టేబుల్ బిల్లా రమేష్ (ఫైల్)

వేటపాలెం(చీరాల), ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : భార్యాభర్తల మధ్య నెలకొన్న వివాదం కారణంగా కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్నారు. వేటపాలెం మండలం దేశాయిపేట గ్రామానికి చెందిన బిల్లా రమేష్‌బాబు (39) చాలా కాలంగా చీరాల పరిధిలోని పలు స్టేషన్‌లలో పనిచేసి, ఎనిమిది నెలలుగా బాపట్ల మండలం వెదుళ్లపల్లి పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్నారు. ఇతనికి కారంచేడు మండలం తిమిడితపాడుకు చెందిన జెమిని అలియాస్ సింధుతో 2000లో వివాహం జరిగింది. వీరికి 12 ఏళ్ల వయస్సు ఉన్న సరళ, తొమ్మిదేళ్ల సాహితి సంతానం. అయితే గత ఐదేళ్లుగా ఇద్దరి మధ్యా నెలకొన్న వివాదాలు కారణంగా భార్య పుట్టింట్లోనే ఉంటూ కోర్టును ఆశ్రయించి భర్తపై భరణం కేసును దాఖలు చేసింది. ప్రస్తుతం ఇది కోర్టులో నడుస్తున్నది. ఈక్రమంలో భార్య గతంలోనే భర్తపై పలుమార్లు ఉన్నతాధికారులను సైతం కలిసి ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో మనస్థాపం చెందిన కానిస్టేబుల్ రమేష్ ఆదివారం రాత్రి విధులు ముగించుకుని ఇంటికి చేరారు. సోమవారం కోర్టులో హాజరు కావాల్సి ఉండగా, అర్ధరాత్రే ఇంట్లో ఉరివేసుకొని మృతి చెందారు. సమాచారం అందుకున్న రూరల్ సీఐ శేషగిరిరావు, వేటపాలెం ఎస్సై వెంకటేశ్వర్లు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. అయితే భార్య జెమిని మాత్రం కోర్టుకు హాజరై అనంతరం విషయం తెలుసుకుని అక్కడి నుంచి హుటాహుటీన కుమార్తెలిద్దరితో హాస్పిటల్ వద్దకు చేరుకుని విలపించారు. ఈనేపథ్యంలో రెండు వర్గాలకు చెందిన కుటుంబ సభ్యులు ఒక దశలో వాగ్వాదానికి దిగారు. వన్‌టౌన్ పోలీసులు అక్కడికి చేరుకుని ఇరువురిని చెదరగొట్టారు. కాగా తండ్రి చనిపోయిన రోజునే పెద్ద కుమార్తె సరళ పుట్టినరోజు కావడం బాధాకరం.



బిక్కుబిక్కుమంటున్న ఇద్దరు కుమార్తెలు

బోరున విలపించిన తండ్రి

మృతి చెందిన కానిస్టేబుల్‌కు ఒక అక్క ఉండగా గతంలో అనారోగ్యంతో మృతి చెందారు. అలాగే తల్లి మృతిచెందింది. తండ్రి సత్యం కుమారుడి మృతిని చూసి వయో భారంతో ఉన్న తనకు దిక్కెవరని బోరున విలపించారు.

బాల్యవివాహాలను పూర్తిగా అరికట్టాలి

బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాలను పూర్తిగా అరికట్టాలని కలెక్టర్ జె.వెంకటమురళి సూచించారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక మున్సిపల్ హైస్కూల్ దగ్గర ర్యాలీని కలెక్టర్ ప్రారంభించారు. పాతబస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఏడాది ఆరోగ్యశాఖ 'ఆరోగ్యకరమైన ప్రారంభం- ఆశాజనక భవిష్యత్తు' అనే లక్ష్యంతో ముందుకెళుతుందని తెలిపారు. బాల్యవివాహాలను ఎవరూ కూడాప్రోత్సహించరాదని చెప్పారు. సామాజిక కార్యకర్తలు, అంగన్‌వాడీ, వైద్యసిబ్బంది ఎక్కడైన బాల్యవివాహాలు గమనించిన యెడల జిల్లా యంత్రాంగానికి తెలియజేయాలన్నారు. రక్తహీనత ఉన్నప్పుడు ప్రభుత్వం అందించే మందులను వాడుకొని ఆరోగ్యకరంగా ఉంటూ ఆరోగ్యమైన బిడ్డలకు జన్మనిచ్చేవిధంగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు సలగల రాజశేఖరబాబు, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ ఎస్.విజయమ్మ, జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.పురుషోత్తం, ఆర్డీవో పి.గ్లోరియా, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి, అధికారులు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, నర్సింగ్ కాలేజి విద్యార్థినులు, మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.



వైద్యసిబ్బంది, అధికారులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న కలెక్టర్ వెంకటమురళి

మంచినీటి పథకం పనుల్లో కదలిక

మరింత విస్తరించేందుకు ప్రణాళిక

రూ.102కోట్లకు పెరగనున్న వ్యయం

అద్దంకి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి పట్టణంలో రాబోయే మూడు దశాబ్దాల పాటు ఎలాంటి మంచినీటి సమస్య లేకుండా చేసే ఉద్దేశంతో నిర్మించ తలపెట్టిన అద్దంకి సమగ్ర మంచినీటి పథకం పనులలో కదలిక ప్రారంభమైంది. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో సుమారు రూ.86కోట్ల ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్, ప్రభుత్వ నిధులతో అద్దంకి సమగ్ర మంచినీటి పథకం పనులను ప్రారంభించారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రీటెండర్‌ల పేరుతో కొంతకాలం కాలయాపన చేసి మెయిన్ పైప్ లైన్ టిడ్కో ఇళ్ల వరకు ఉండాల్సి ఉండగా, పట్టణంలోని మార్కెట్ యార్డు వరకే పరిమితం చేసి రూ.80 కోట్లకు కుదించారు. అయితే పనులు పూర్తి కాకపోగా కాంట్రాక్టర్‌కు బిల్లుల చెల్లింపు జరగకపోవడంతో ఏడాదిన్నర కిందట పనులు అర్థాంతరంగా ఆగిపోయాయి. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రత్యేక దృష్టి సారించారు. అద్దంకి పట్టణంతో పాటు టిడ్కో ఇళ్లు, బొమ్మనంపాడురోడ్డు, నాగులపాడు రోడ్డు, వేలమూరిపాడు రోడ్డులో కొత్తగా ఏర్పడ్డ లేఅవుట్‌లలోని కాలనీలకు కూడా మంచినీరు సరఫరా జరగాలన్న ఉద్దేశంతో రివైజ్డ్ అంచనాలను తయారు చేయించారు. సుమారు రూ.101.96కోట్ల అంచనాతో ఇప్పటికే నిర్మాణంలో ఉన్న మార్కెట్‌యార్డు, ఎన్ఎస్‌పీ కాలనీ, ప్రభుత్వ జూనియర్ కళాశాల ల ప్రాంగణాలలో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంక్‌లతో పాటు అదనంగా మూడు లేఅవుట్‌లలో ప్రత్యేకంగా ఓవర్‌హెడ్ ట్యాంక్‌లు, పైప్‌లైన్ లు ఏర్పాటు చేసే విధంగా రూపకల్పన చేశారు. ఇందుకు సంబంధించి ఇటీవల గుంటూరు ఎస్ఈ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అద్దంకి సమగ్ర మంచినీటి పథకం పనులు, కొత్త ప్రతిపాదనలకు సంబంధించి పరిశీలన చేశారు. దీంతో త్వరలో మరలా ప్రారంభమయ్యే అవకాశం ఉంది.



అర్థాంతరంగా ఆగిపోయిన ఓవర్‌హెడ్ ట్యాంక్ పనులు

నేటి మ్యాచ్‌లు

కోల్‌కతా x లఖ్‌నవూ — మ.3.30 నుంచి — వేదిక: కోల్‌కతా

పంజాబ్ x చెన్నై — రా.7.30 నుంచి — వేదిక: చండీగఢ్

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
ఢిల్లీ	3	3	0	0	6	1.257
గుజరాత్	4	3	1	0	6	1.031
బెంగళూరు	4	3	1	0	6	1.015
పంజాబ్	3	2	1	0	4	0.074
కోల్‌కతా	4	2	2	0	4	0.070
లఖ్‌నవూ	4	2	2	0	4	0.048
రాజస్థాన్	4	2	2	0	4	-0.185
ముంబై	5	1	4	0	2	-0.010
చెన్నై	4	1	3	0	2	-0.891
హైదరాబాద్	5	1	4	0	2	-1.629

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్



నాన్నంటే.. ఎంతో భయం!

న్యూఢిల్లీ: చిన్నప్పుడు తనకు నాన్న పాన్ సింగ్ అంటే ఎంతో భయమనే విషయాన్ని ఓ పాడ్‌కాస్ట్‌లో మహేంద్ర సింగ్ ధోనీ బయటపెట్టాడు. ఆయన వల్లే ఎంతో క్రమశిక్షణతో కూడిన జీవితం అలవాటైందని తెలిపాడు. తన కెరీర్‌ను తీర్చిదిద్దడంలో ఆయన పాత్ర ఎంతో ఉందని చెప్పాడు. 'నాన్న ఎంతో కఠినంగా ఉండేవారు. కానీ, ఎన్నడూ కోప్పడలేదు. ఎప్పుడూ సమయపాలన పాటించేవారు. అది నాకు కూడా అలవడిందని తెలిపాడు. తన తండ్రి వల్లే జీవితంలో ఎప్పుడూ అభద్రతా భావానికి గురికాలేదన్నాడు.

ఆర్‌సీబీ.. హమ్మయ్య

ఆఖరి ఓవర్‌లో అద్భుతం
విరాట్, రజత్ హాఫ్ సెంచరీలు
పోరాడి ఓడిన ముంబై
రాణించిన తిలక్



ముంబై: ఐపీఎల్ అభిమానులకిది అదిరిపోయే మ్యాచ్. బ్యాటింగ్‌లో చెలరేగిన బెంగళూరు ప్రత్యర్థి ముంబై ముందు 222 పరుగుల భారీ లక్ష్యాన్ని ఉంచినా.. ఆఖరి బంతి వరకూ ఉత్కంఠను రేకెత్తించింది. ఓ దశలో ముంబై ఓటమి లాంఛనమే అనిపించినా తిలక్ వర్మ (29 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సర్లతో 56), హార్దిక్ పాండ్యా (15 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సర్లతో 42)ల దంచుడు ఆర్‌సీబీలో గుబులు రేపింది. కానీ కీలక దశలో వారి వికెట్లు తీసి తిరిగి పోటీలోకి రావడంతో పాటు, చివరి ఓవర్‌లో స్పిన్నర్ క్రునాల్ (4/45) మూడు వికెట్లు పడగొట్టి ఆర్‌సీబీని గట్టెక్కించాడు. దీంతో సోమవారం జరిగిన ఈ మ్యాచ్‌లో రజత్ సేన 12 పరుగుల తేడాతో నెగ్గింది. అలాగే వాంఖడేలో ఈ జట్టు పదేళ్ల తర్వాత గెలవడం మరో విశేషం. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు 20 ఓవర్లలో 5 వికెట్లకు 221 పరుగులు చేసింది. విరాట్ కోహ్లీ (42 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్సర్లతో 67), దేవ్‌దత్ (22 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్సర్లతో 37), రజత్ పటీదార్ (32 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్సర్లతో 64), జితేశ్ (19 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్సర్లతో 40 నాటౌట్) చెలరేగారు. హార్దిక్, బౌల్ట్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో ముంబై 20 ఓవర్లలో 9 వికెట్లకు 209 పరుగులు చేసి ఓడింది. హాజెల్‌వుడ్, యష్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా రజత్ పటీదార్ నిలిచాడు.

చివర్లో బోల్తా: భారీ ఛేదనలో ముంబై ఆరంభం నుంచే ఇబ్బందిపడింది. ఆర్‌సీబీ బౌలర్లు కట్టడి చేయడంతో ఓపెనర్లు రోహిత్ (17), రికెల్టన్ (17) తక్కువ స్కోర్లకే వెనుదిరిగారు. అటు విల్ జాక్స్ (22)తో కలిసి సూర్యకుమార్ (28) మూడో వికెట్‌కు 41 పరుగులు జోడించి ఆదుకునే ప్రయత్నం చేశాడు. అయితే సూర్య భారీ షాట్లు ఆడేందుకు కష్టపడ్డాడు. రెండు క్యాచ్ అవుట్స్ ప్రమాదం నుంచి తప్పించుకున్న తను చివరకు 12వ ఓవర్‌లో యష్‌కు చిక్కాడు. అప్పటికి స్కోరు 99/4గా ఉండడంతో ఇక ముంబైకి భారీ ఓటమి ఖాయమనిపించింది. కానీ ఈ దశలో తిలక్, హార్దిక్ బ్యాట్లు ఝుళిపించి వణుకు పుట్టించారు. 13వ ఓవర్‌లో తిలక్ 6,4,4.. 14వ ఓవర్‌లో హార్దిక్ 6,4,6,4తో 39 పరుగులు రావడంతో మ్యాచ్ ముంబై వైపు తిరిగింది. అలాగే తిలక్ 16వ ఓవర్‌లో ఫిఫ్టీ పూర్తి చేశాడు. కానీ అంతా సవ్యంగా సాగుతున్న దశలో ముంబై వరుస ఓవర్లలో ఈ ఇద్దరి వికెట్లను కోల్పోయింది. సమీకరణం 6 బంతుల్లో 19 రన్స్‌కి చేరింది. అయితే క్రునాల్ ఆరు పరుగులే ఇచ్చి శాంట్నర్ (8), చాహర్ (0), నమన్ (11)ల వికెట్లు తీసి ఆర్‌సీబీని సంబరాల్లో ముంచాడు.

ఆరంభం నుంచే దంచుడు: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆర్‌సీబీ జట్టు స్కోరు రాకెట్ వేగంతో దూసుకెళ్లింది. ఓపెనర్ విరాట్ అనూహ్యంగా ఆరంభం నుంచే ఎదురుదాడికి దిగగా, దేవ్‌దత్, కెప్టెన్ రజత్, జితేశ్ కూడా అదరగొట్టడంతో బెంగళూరు భారీ స్కోరందుకుంది. చివరి ఐదు ఓవర్లలో జట్టు 70 పరుగులు సాధించింది. బుమ్రా ఒక్కడే కాస్త కట్టడి చేశాడు. అయితే తొలి ఓవర్ రెండో బంతికే ఓపెనర్ సాల్ట్ (4)ను పేసర్ బౌల్ట్ బౌల్డ్ చేసినా.. జట్టు ఆటలో మాత్రం జోరు తగ్గలేదు. ముంబైపై బెంగళూరు తమ అత్యధిక పవర్‌ప్లే స్కోరు (73/1)ను సాధించింది. పడిక్కళ్‌ను స్పిన్నర్ విఘ్నేష్ అవుట్ చేసి రెండో వికెట్‌కు 52 బంతుల్లోనే 91 పరుగుల భాగస్వామ్యానికి చెక్ పెట్టాడు. అనంతరం 10-13 ఓవర్ల మధ్య పరుగులు నెమ్మదించాయి. అయితే శాంట్నర్ ఓవర్‌లో 20 పరుగులు రావడంతో తిరిగి లయ అందుకుంది. తర్వాతి ఓవర్‌లోనే విరాట్, లివింగ్‌స్టోన్ (0)లను హార్దిక్ అవుట్ చేశాడు. కానీ డెత్ ఓవర్లలో పటీదార్‌కు జితేశ్ జత కలవడంతో ముంబై బౌలర్లు గతి తప్పారు. 16వ ఓవర్‌లో జితేశ్ 4,6 రజత్ 4తో బౌల్ట్ 18 రన్స్ సమర్పించుకున్నాడు. ఇక ఆ తర్వాత పటీదార్ 6,6,4తో 25 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాడు. హార్దిక్ వేసిన ఈ 17వ ఓవర్‌లో ఏకంగా 23 రన్స్ వచ్చాయి. 19వ ఓవర్‌లో జితేశ్ రెండు సిక్సర్లతో స్కోరు 200 దాటగా రజత్ వికెట్‌ను కోల్పోయింది. వీరి మధ్య ఐదో వికెట్‌కు 69 పరుగులు జత చేరాయి. చివరి ఓవర్‌లో బుమ్రా 8 పరుగులే ఇచ్చి కాస్త ఊరటనిచ్చాడు.

స్కోరుబోర్డు

బెంగళూరు: సాల్ట్ (బి) బౌల్ట్ 4; విరాట్ (సి) నమన్ (బి) హార్దిక్ 67; పడిక్కళ్ (సి) జాక్స్ (బి) విఘ్నేష్ 37; పటీదార్ (సి) రికెల్టన్ (బి) బౌల్ట్ 64; లివింగ్‌స్టోన్ (సి) బుమ్రా (బి) హార్దిక్ 0; జితేశ్ (నాటౌట్) 40; డేవిడ్ (నాటౌట్) 1; **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 20 ఓవర్లలో 221/5. వికెట్ల పతనం:** 1-4, 2-95, 3-143, 4-144, 5-213; **బౌలింగ్:** బౌల్ట్ 4-0-57-2; దీపక్ 2-0-29-0; బుమ్రా 4-0-29-0; జాక్స్ 1-0-10-0; శాంట్నర్ 4-0-40-0; హార్దిక్ 4-0-45-2; విఘ్నేష్ 1-0-10-1.

ముంబై: రోహిత్ (బి) యశ్ దయాల్ 17, రికెల్టన్ (ఎల్బీ) హాజెల్‌వుడ్ 17, విల్ జాక్స్ (సి) కోహ్లీ (బి) క్రునాల్ 22, సూర్యకుమార్ (సి) లివింగ్‌స్టోన్ (బి) యశ్ దయాల్ 28, తిలక్ వర్మ (సి) సాల్ట్ (బి) భువనేశ్వర్ 56, హార్దిక్ (సి) లివింగ్‌స్టోన్ (బి) హాజెల్‌వుడ్ 42, నమన్ ధిర్ (సి)యశ్ దయాల్ (బి) క్రునాల్ 11, శాంట్నర్ (సి) టిమ్ డేవిడ్ (బి) క్రునాల్ 8, దీపక్ చాహర్ (సి) టిమ్ డేవిడ్ (బి) క్రునాల్ 0, బౌల్ట్ (నాటౌట్) 1, బుమ్రా (నాటౌట్) 0, **ఎక్స్‌ట్రాలు 7 ; మొత్తం 20 ఓవర్లలో 209/9 ; వికెట్లపతనం :** 1-21, 2-38, 3-79, 4-99, 5-188, 6-194, 7-203, 8-203, 9/209 ; **బౌలింగ్:** భువనేశ్వర్ 4-0-48-1, యశ్ దయాల్ 4-0-46-2, హాజెల్‌వుడ్ 4-0-37-2, సుయాష్ శర్మ 4-0-32-0, క్రునాల్ 4-0-45-4.



మనోళ్లు మురిపిస్తారా?

బరిలో సింధు, సేన్, ప్రణయ్

నేటినుంచి బ్యాడ్మింటన్ ఆసియా చాంపియన్‌షిప్

నిన్‌గ్బో (చైనా): ఇటీవలి కాలంలో జరిగిన అన్ని ప్రధాన టోర్నీలలో భారత షట్లర్లు తీవ్రంగా నిరాశ పరిచారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఇక్కడ ప్రారంభమయ్యే ప్రతిష్ఠాత్మక ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో మనోళ్లు ఎలా రాణిస్తారోనన్న ఉత్కంఠ ఏర్పడింది. పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్, హెచ్ఎస్ ప్రణయ్, కిరణ్ జార్జ్, ప్రియాన్షు రజావత్ బరిలోకి దిగుతున్నారు. మహిళల సింగిల్స్‌లో పీవీ సింధు, మాళవిక బన్సోడ్, అనుపమా ఉపాధ్యాయ, ఆకర్షి కశ్యప్ తలపడుతున్నారు. మహిళల డబుల్స్‌లో గాయత్రీ గోపీచంద్/ట్రీసా జాలీ ద్వయం, పురుషుల్లో సాత్విక్/చిరాగ్ జంట టోర్నమెంట్‌లో పాల్గొనడంలేదు. తొలి రౌండ్‌లో థైపీకి చెందిన లీ చియాతో లక్ష్యసేన్ తలపడతాడు. గువాంగ్ జు (చైనా)తో ప్రణయ్, కంటపాన్ (ఇండోనేసియా)తో రజావత్, క్వాలిఫయర్‌తో కిరణ్ జార్జ్ మొదటి రౌండ్‌లో అమీతుమీ తేల్చుకుంటారు. మహిళల సింగిల్స్‌లో..ప్రపంచ 17వ ర్యాంకర్ సింధు-ఎస్తేర్ నురుమి (ఇండోనేసియా)తో టోర్నీని ప్రారంభిస్తుంది. ప్రపంచ మాజీ చాంపియన్ రచనోక్ ఇంటనాన్‌ను అనుపమ, చైనా షట్లర్ ఫాంగ్‌ను మాళవిక, రెండో సీడ్ యా హాన్ (చైనా)ను ఆకర్షి ఢీకొంటారు. మహిళల డబుల్స్‌లో ప్రియ/శ్రుతి జంట- థైపీ జోడీ యున్ సంగ్/చీన్ యుతో తలపడతారు. పురుషుల డబుల్స్‌లో హరిహరన్/రూబన్ కుమార్, మిక్స్‌డ్ డబుల్స్‌లో రోహన్/రుత్వికా శివాని, సతీష్ కరుణాకరన్/ఆద్య, ధ్రువ్ కపిల/తనీషా క్రాస్టో అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.

2019 తర్వాత టీ20ల్లో తన ఫాస్టెస్ట్ (29 బంతుల్లో) హాఫ్ సెంచరీ చేసిన విరాట్ కోహ్లీ. అలాగే ఈ ఫార్మాట్‌లో 13 వేల రన్స్ పూర్తి చేసిన ఐదో బ్యాటర్ అయ్యాడు.

1 ఐపీఎల్‌లో ఎక్కువ వికెట్లు (184) తీసిన పేసర్‌గా భువనేశ్వర్. బ్రావో (183)ను అధిగమించాడు.

2 వాంఖడేలో ఆర్‌సీబీకిది రెండో అత్యధిక స్కోరు (221/5). 2015లో 235/1 రన్స్ చేసింది.

నర్మదకు ఆరో స్థానం

బ్యూనస్ ఎయిర్స్ (అర్జెంటీనా): ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్‌కప్‌లో సోమవారం భారత షూటర్లు నిరాశపర్చారు. సోమవారం జరిగిన మహిళల 10 మీ. ఎయిర్ రైఫిల్ ఫైనల్లో నర్మద నితిన్ 166.3 పాయింట్లతో ఆరో స్థానంలో, సోనమ్ ఉత్తమ్ 124.4 పాయింట్లతో ఎనిమిది స్థానంలో నిలిచారు. జిఫి వాంగ్ (చైనా) స్వర్ణం నెగ్గగా.. యుంజీ కవ్వాన్ (కొరియా) రజతం, ఆడ్రే గొగ్నియాత్ (స్విట్జర్లాండ్) కాంస్యం దక్కించుకొన్నారు. అంతకుముందు జరిగిన క్వాలిఫికేషన్ రౌండ్‌లో నర్మద ఆరో స్థానం, సోనమ్ తొమ్మిదో స్థానంతో ఫైనల్‌కు అర్హత సాధించారు.



ఇంగ్లండ్ వన్డే, టీ20 కెప్టెన్‌గా బ్రూక్

లండన్: ఇంగ్లండ్‌క్రికెట్ పరిమిత ఓవర్ల ఫార్మాట్లకు ఇక నుంచి హ్యారీ బ్రూక్ సారథ్యం వహించనున్నాడు. ఈ మేరకు ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) అధికారిక ప్రకటన చేసింది. చాంపియన్స్ ట్రోఫీలో జట్టు పేలవ ప్రదర్శన కారణంగా జోస్ బట్లర్ కెప్టెన్సీ నుంచి వైదొలిగాడు. ఈనేపథ్యంలో వైస్ కెప్టెన్‌గా ఉన్న 26 ఏళ్ల బ్రూక్‌కు వన్డే, టీ20 జట్ల పగ్గాలు అప్పగించారు. టెస్టు కెప్టెన్ స్టోక్స్‌కే పరిమిత ఓవర్ల కెప్టెన్సీని అప్పగిస్తారనే కామెంట్స్ వినిపించినా.. ఈసీబీ బ్రూక్ వైపు మొగ్గు చూపింది. 2022లో అరంగేట్రం చేసిన బ్రూక్ ఇంగ్లండ్ తరపున మూడు ఫార్మాట్లలోనూ ఆడుతున్నాడు.

ఇషాంత్‌కు జరిమానా

హైదరాబాద్: గుజరాత్ టైటాన్స్ పేసర్ ఇషాంత్ శర్మ మ్యాచ్ ఫీజులో 25 శాతం జరిమానా విధించారు. అంతేకాకుండా ఓ డీమెరిట్ పాయింట్ కూడా అతడి ఖాతాలో చేరింది. ఆదివారం సన్‌రైజర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఇషాంత్ ఐపీఎల్ కోడ్ ఆఫ్ కండక్ట్ 2.2 రూల్‌ను అతిక్రమించినట్టు తేలింది. క్రికెట్ సామగ్రి, జెర్సీ, మైదానంలోని వస్తువులను అగౌరవపర్చడం దీనికిందికి వస్తుంది. రెఫరీ శ్రీనాథ్ విధించిన ఈ జరిమానాను ఇషాంత్ అంగీకరించాడు.

టాంజానియా చరిత్ర

తొలిసారి అండర్-19 వరల్డ్‌కప్‌నకు అర్హత



న్యూఢిల్లీ: ఆఫ్రికా క్రికెట్ జట్టు టాంజానియా చరిత్ర సృష్టించింది. తొలిసారి అండర్-19 వరల్డ్‌కప్‌నకు అర్హత సాధించింది. నైజీరియాలో జరిగిన అండర్-19 వరల్డ్‌కప్ క్వాలిఫయర్స్‌లో ఆరు జట్ల రౌండ్ రాబిన్ లీగ్‌లో ఆడిన ఐదు మ్యాచ్‌ల్లోనూ టాంజానియా విజయాలు సాధించింది. ఈ క్రమంలో 2026లో జరిగే జూనియర్ వరల్డ్‌కప్‌నకు అర్హత సాధించిన 12వ జట్టుగా టాంజానియా నిలిచింది. 16 జట్ల టోర్నీలో ఆతిథ్య జట్టుగా జింబాబ్వేతోపాటు గత టోర్నీలో మెరుగైన ప్రదర్శన చేసిన 10 జట్లు నేరుగా క్వాలిఫై అయ్యాయి. ఆసియా, ఈస్ట్ ఆసియా పసిఫిక్, ఐరోపా, అమెరికా రీజియన్ల నుంచి ఒక్కో జట్టు అర్హత సాధించాల్సి ఉంది.

గుట్టుగా వ్యాధుల విస్తరణ

లక్షణాలు లేకుండా పెరుగుతున్న జబ్బులు

దీర్ఘకాల వ్యాధులతో జీవిస్తున్న లక్షలాది మంది

దేశవ్యాప్తంగా పెరుగుతున్న బీపీ, షుగర్, ఫ్యాటీలివర్

అపోలో 'హెల్త్ ఆఫ్ ద నేషన్ 2025' నివేదికలో వెల్లడి

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): అధిక రక్తపోటు.. పైకి ఏ లక్షణమూ కనిపించదు! లోలోపలే శరీరానికి తీరని నష్టం చేస్తుంది!! మధుమేహం.. అధికంగా దాహం వేయడం, ఎక్కువసార్లు మూత్రవిసర్జనకు వెళ్లాల్సి రావడం వంటి లక్షణాలున్నా చాలామంది పట్టించుకోరు!! ఈ రెండింటికీ తోడు.. ఇటీవలికాలంలో బాగా పెరుగుతున్న ఫ్యాటీ లివర్!! పరీక్ష చేస్తే కానీ బయటపడని ఈ జీవనశైలి రుగ్మతలు తమకు ఉన్నాయన్న విషయం కూడా తెలియకుండానే దేశవ్యాప్తంగా లక్షలాది మంది కాలం గడిపేస్తున్నట్టు అపోలో ఆస్పత్రి సోమవారం విడుదల చేసిన 'హెల్త్ ఆఫ్ ద నేషన్ 2025' నివేదికలో వెల్లడైంది. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఉన్న అపోలో ఆస్పత్రుల్లో 25 లక్షలమందికిపైగా వ్యక్తులకు చేసిన ఆరోగ్య పరీక్షల ఆధారంగా రూపొందించిన నివేదిక ఇది.

దేశవ్యాప్త గణాంకాలు..

దేశవ్యాప్తంగా 4.5 లక్షల మందికి బీపీ పరీక్ష చేయగా.. వారిలో 26% మంది హైపర్ టెన్షన్‌తో బాధపడుతున్నట్టు తేలింది. అలాగే.. 23% మంది మధుమేహంతో, 65 శాతం మంది ఫ్యాటీలివర్‌తో, 46 శాతం మంది అథెరోస్క్లెరోసిస్ (రక్తనాళాల్లో కాల్షియం పేరుకుపోయే) సమస్యతో బాధపడుతున్నట్టు అపోలో నివేదిక వెల్లడించింది. ముఖ్యంగా.. ఫ్యాటీలివర్ బారిన పడినవారిలో 85 శాతం మందికి అసలు మద్యపానం అలవాటే లేదని.. అథెరోస్క్లెరోసిస్ బాధితుల్లో 2.5 శాతం మంది 40 ఏళ్లలోపువారే కావడం ఆందోళనకరమని నివేదిక పేర్కొంది. అలాగే.. రుతుక్రమం ఆగిపోయిన తర్వాత మహిళలు తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నట్టు నివేదిక ఆందోళన వెలిబుచ్చింది. అపోలో పరీక్షలు చేసినవారిలో మెనోపాజ్‌కు ముందు మధుమేహం బారిన పడినవారు 14% ఉంటే.. మెనోపాజ్ తర్వాత ఆ సంఖ్య 40 శాతానికి చేరిందని పేర్కొంది. బాలల్లోనూ, యువతలోనూ పెరుగుతున్న ఊబకాయంపై ఆ నివేదిక ఆవేదన వ్యక్తం చేసింది. ప్రాథమిక పాఠశాలల పిల్లల్లో 8 శాతం మంది, కాలేజీ విద్యార్థులు 28 శాతం మంది ఊబకాయంతో బాధపడుతున్నట్లు వెల్లడించింది. మరింత ఆందోళన కలిగించే అంశం ఏమిటంటే.. యువతలో 19 శాతం మందిలో ముందస్తు రక్తపోటు (ప్రీహైపర్‌టెన్షన్) సమస్య కనిపించడం. పౌష్టికాహార లోపం, శారీరక శ్రమ లేకపోవడం, యువతలో ఒత్తిడి పెరిగిపోవడం ఈ సమస్యకు కారణంగా భావిస్తున్నారు. ఇక.. దేశవ్యాప్తంగా 53 వేల మందికి నిద్ర రుగ్మతలకు సంబంధించిన పరీక్షలు చేయగా వారిలో 24 శాతం మంది అబ్‌స్ట్రక్టివ్ స్లీప్ ఏప్నియాతో బాధపడుతున్నట్టు తేలింది. అలాగే.. రక్తహీనత సమస్యతో 45% మంది మహిళలు, 26% మంది పురుషులు బాధపడుతుండగా.. విటమిన్ డి లోపం స్త్రీ, పురుషుల్లో వరుసగా 77%, 82 శాతంగా ఉంది. విటమిన్ బి12 లోపం 38 శాతం మంది పురుషులు, 27 శాతం మంది మహిళల్లో ఉన్నట్టు తేలింది. 40 ఏళ్లలోపు వారిలో ఈ లోపం మరింత స్పష్టంగా కనిపించింది. బి12 లోపం ఉన్నవారు వైద్యులను సంప్రదించి, దాన్ని సరిచేసుకోకపోతే.. పలు ఆరోగ్యసమస్యల బారినపడే ప్రమాదం ఉందని నివేదిక హెచ్చరించింది. అదే సమయంలో.. ముందస్తు వైద్యపరీక్షలు చేయించుకుని అనారోగ్య సమస్యలను గుర్తించి, వైద్యుల సలహా సూచనలను పాటించిన 59 శాతం మందిలో హెచ్‌బీఏ1సీ (గడిచిన 2-3 నెలల సగటు షుగర్ లెవల్స్) స్థాయులు తగ్గాయని, 51 శాతం మందికి అధిక రక్తపోటు స్థాయులు తగ్గాయని నివేదికలో తేలింది.

ప్రివెంటివ్ హెల్త్‌కేర్‌పై దృష్టిపెట్టాలి

బీపీ, షుగర్, ఫ్యాటీ లివర్ వంటి సమస్యలున్నా.. వాటి లక్షణాలు కనిపించకపోవడం వల్ల చాలా మంది వైద్యపరీక్షలు చేయించుకోవట్లేదని, అలా కాకుండా ముందుగా పరీక్షలు చేయించుకుంటే వీటిలో చాలా జబ్బులు వచ్చే ప్రమాదాన్ని ముందుగానే గుర్తించవచ్చని నివేదిక సూచించింది. నివేదికలోని అంశాలపై అపోలో ఆస్పత్రుల చైర్మన్ ప్రతాప్‌రెడ్డి మాట్లాడారు. ప్రివెంటివ్ హెల్త్‌కేర్ అంటే భవిష్యత్‌లో నిర్ణయం తీసుకునే అంశం కాదని, ప్రస్తుతం దేశ శ్రేయస్సుకు అదే మూలస్తంభం అని ఆయన అభిప్రాయపడ్డారు. మద్యం సేవించకపోయినా ఫ్యాటీ లివర్ వ్యాధి రావడం.. కొత్త రోగనిర్ధారణ పరీక్షల అవసరాన్ని తెలియజేస్తోందని, సంప్రదాయ స్క్రీనింగ్ పరీక్షలు ఇక ఎంతమాత్రం సరిపోవని అపోలో ఆస్పత్రుల ఎండీ సునీతా రెడ్డి అన్నారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★



శక్తిమంతమైన లుక్‌లో...

అశ్విన్‌బాబు హీరోగా ఎం.ఆర్.కృష్ణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'వచ్చినవాడు గౌతమ్'. టి.గణపతి రెడ్డి నిర్మిస్తున్నారు. మురళీ శర్మ, సచిన్ ఖేడేకర్, అభినయ, రియా సుమన్, ఆయేషా ఖాన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి అశ్విన్‌బాబు లుక్‌ను విడుదల చేశారు మేకర్స్ ఇందులో ఆయన పాత్ర శక్తిమంతంగా ఉన్నట్లు తెలుస్తోంది. మెడికల్ యాక్షన్ మిస్టరీగా తెరకెక్కుతున్న ఈ చిత్రం త్వరలోనే విడుదల కానుంది. ఈ చిత్రానికి ఎడిటర్: ఎం.ఆర్.వర్మ, డీఓపీ: ఎం.ఎన్.బాల్‌రెడ్డి, సంగీతం: గౌరహరి.

గోదారి అందాల నడుమ..



విక్టరీ వెంకటేశ్ నటించిన సంక్రాంతికి వస్తున్నాం' చిత్రంలో 'గోదారి గట్టుపైన' పాట ఎంత పాపులర్ అయిందో చెప్పనక్కర్లేదు. ఆ పాటలోని మొదటి పదాన్ని తమ సినిమాకు టైటిల్‌గా నిర్ణయించింది రెడ్ పప్పెట్ ప్రొడక్షన్స్ సంస్థ. 'గోదారి గట్టు పైన' పేరుతో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రంలో సుమంత్ ప్రభాస్ హీరోగా నటిస్తున్నారు. సుభాష్‌చంద్ర దర్శకుడు. నిధి ప్రదీప్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో జగపతిబాబు కీలక పాత్ర పోషిస్తున్నారు. 'ఒక చల్లని సాయంత్రం వేళ ప్రశాంతమైన గోదావరి ఒడ్డున మీ స్నేహితులతో కూర్చుని సమయం గడపడం ఎంత ప్రశాంతంగా ఉంటుందో.. మా సినిమా కూడా అంతే ప్రశాంతంగా ఉంటుంది. అందమైన భావోద్వేగాలతో ఉంటుంది. గోదావరి జిల్లాలు వేల్పూరు, రేలంగి, భీమవరం నేపథ్యంలో రూపుదిద్దుకుంటోంది. పశ్చిమ గోదావరి ప్రాంతంలోని సుందరమైన ప్రకృతి దృశ్యాలు ప్రేక్షకులకు కనువిందు చేస్తాయి' అని దర్శకుడు చెప్పారు. రాజీవ్ కనకాల, లైలా, దేవీ ప్రసాద్, హర్షవర్ధన్, సుదర్శన్, రాజ్‌కుమార్ కాసిరెడ్డి, వివా రాఘవ్, రోహిత్ కృష్ణ వర్మ కీలక పాత్రలు పోషిస్తున్నారు. అభినవ్ రావు ఈ చిత్రానికి నిర్మాత.



ముచ్చటగా బంధాలే!

విజయశాంతి, కల్యాణ్‌రామ్ తల్లీకొడుకులుగా నటిస్తున్న 'అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి' చిత్రం ఈ నెల 18న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. ఈ యాక్షన్ ప్యాక్డ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లో వీరిద్దరి పాత్రలు చాలా కీలకం. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మించారు. ఇటీవల విడుదల చేసిన ఫస్ట్ సింగిల్‌కు అద్భుతమైన స్పందన వస్తోంది. సెకండ్ సింగిల్ 'ముచ్చటగా బంధాలే' ను బుధవారం చిత్తూరులోని శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కాలేజ్ గ్రౌండ్స్‌లో విడుదల చేయనున్నారు. తల్లీకొడుకుల అనుబంధాన్ని అద్భుతంగా వివరించే పాట ఇది. ఇటీవలే సినిమా ప్రమోషన్స్ ప్రారంభించారు. శ్రీరామనవమి సందర్భంగా చేసిన స్పెషల్ ఇంటర్వ్యూ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సోహైల్ ఖాన్, సాయి మంజ్రేకర్, శ్రీకాంత్, పృథ్వీరాజ్ కీలక పాత్రలు పోషించిన ఈ చిత్రానికి అజనీష్ లోక్‌నాథ్ సంగీతాన్ని అందించారు. రామ్‌ప్రసాద్ ఛాయాగ్రాహకుడు.





షారుఖ్‌తో మళ్లీ..

షారుఖ్ ఖాన్ కొత్త చిత్రం 'కింగ్' గురించి వినిపిస్తున్న ఒక కొత్త వార్త ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. షారుఖ్, ఆయన కుమార్తె సుహానా ఖాన్ ప్రధాన పాత్రలు పోషించే ఈ చిత్రంలో ఓ ప్రత్యేక పాత్రను దీపిక పదుకోన్ పోషించనున్నారట. ఇందులో ప్రత్యేకత ఏముంది అంటారా.. సుహానాకు ఆమెకు తల్లిగా నటించడం ప్రత్యేకతేగా మరి. షారుఖ్, దర్శకుడు సిద్ధార్థ్ ఆనంద్ ఆ పాత్ర ప్రాధాన్యం గురించి దీపికకు చెప్పి ఆమెను ఒప్పించారట. షారుఖ్ చిత్రంలో దీపిక మళ్లీ నటిస్తున్నందుకు ఆమె అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు కానీ ఇందులో ఆమెది తల్లి పాత్ర అని తెలియగానే నీరస పడిపోతున్నారు. ఎందుకంటే.. 'దీపికకు 39 ఏళ్లు, సుహానాకు 24 ఏళ్లు. వీరిద్దరికి పదిహేనేళ్ల ఏజ్ గ్యాపే ఉంది కనుక తల్లీకూతుళ్లుగా కంటే అక్కా చెల్లెళ్లుగా చూపిస్తే బాగుంటుంది.. ఆలోచించండి ఖాన్ సాబ్' అని అభిమానులు అభ్యర్థిస్తున్నారట.

ఎక్స్‌లోకి రీ ఎంట్రీ

నటి సమంత సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లోకి రీఎంట్రీ ఇచ్చారు. ఈ సందర్భంగా తన సొంత నిర్మాణ సంస్థ ట్రాలాలా పిక్చర్స్‌పై ఆమె నిర్మించిన తొలి చిత్రం 'శుభం' టీజర్‌ను అభిమానులతో పంచుకున్నారు. 'పెద్ద కలలతో మా టీమ్ చేసిన చిన్ని ప్రయత్నమిది.. ఎంతో ప్రేమతో చేసిన ఈ చిత్రాన్ని ఆదరిస్తారని ఆశిస్తున్నాను' అని పేర్కొన్నారు. 'సినిమా బండి' ఫేమ్ ప్రవీణ్ కండ్రీగుల దర్శకత్వం వహించిన ఈ చిత్ర టీజర్ ఇటీవలే విడుదలైంది. త్వరలోనే రిలీజ్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. కాగా, 2012లో ఎక్స్(అప్పట్లో ట్విట్టర్) ఖాతాను ప్రారంభించారు సమంత. ఇటీవలె అందులో పెట్టిన అన్ని పోస్టులను తొలగించారు. అప్పటినుంచి ఎక్కువగా ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, యూట్యూబ్ ద్వారా తన సినిమాలకు సంబంధించిన అప్‌డేట్స్ వ్యక్తిగత విషయాలు, ఫొటోలు షేర్ చేస్తున్నారు. ఇప్పుడీ చిత్రాన్ని ప్రమోట్ చేయడానికి ఆమె ఎక్స్ ఖాతాను తిరిగి ఉపయోగించడంతో నెటిజన్లు ఖుషీ అవుతున్నారు. ఆమెను స్వాగతిస్తూ పోస్టులు పెడుతున్నారు.

ఏకే వస్తున్నాడు..



తమిళ హీరో అజిత్‌కుమార్ నటించిన చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ'. 'మార్క్ ఆంటోని' ఫేమ్ అధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో మైత్రీ మూవీమేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై రవిశంకర్ నిర్మించారు. త్రిష కృష్ణన్ కథానాయికగా నటించారు. షాయాజీ షిండే, జాకీ ష్రాఫ్, ప్రభు, సునీల్, అర్జున్‌దాస్, సిమ్రాన్, ప్రియాప్రకాశ్ వారియర్ కీలక పాత్రలు పోషించారు. ఈనెల 10న సినిమా విడుదలవుతోంది. తాజాగా, ఈ సినిమా తెలుగు ట్రైలర్‌ను విడుదల చేశారు. 'నువ్వు పెద్ద విలన్‌వని విన్నా.. కానీ నా గేమ్‌లో నేనేరా నీకు విలన్', 'ఏకే వస్తున్నాడు దారివదలండ్రా', 'వాడు భయాన్ని భయపెట్టేవాడు' వంటి సంభాషణలు సినిమాపై ఆసక్తిని రెట్టింపు చేశాయి.

రెండో సారి క్యాన్సర్... భార్యకు ధైర్యం చెప్పిన హీరో



బాలీవుడ్ నటుడు ఆయుష్మాన్ ఖురానా సతీమణి, నటి, దర్శకురాలు తహీరా కశ్యప్ రెండోసారి క్యాన్సర్ బారిన పడ్డారు. తనకు తిరిగి రొమ్ము క్యాన్సర్ సోకినట్టు ఆమె సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. ఎటువంటి అవాంతరాలు ఎదురైనా ధైర్యంగా ముందుకు వెళ్లాలని తహీరా తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా తహీరా తన రొమ్ము క్యాన్సర్ విషయం వెల్లడించి ప్రతి ఒక్కరూ ఆరోగ్యం మీద శ్రద్ధ పెట్టాలని కోరారు. భార్య పెట్టిన పోస్ట్‌కు వెంటనే స్పందిస్తూ 'మై హీరో' అని కామెంట్ పెట్టారు. 2018 లో ఆమెకు బ్రెస్ట్ క్యాన్సర్ వచ్చినట్లు నిర్ధారణ అయింది. ఇక అప్పటినుంచి చికిత్సలో భాగంగా జరిగే ప్రతి చర్యనీ ఆమె సోషల్ మీడియాలో పంచుకుంటూ తనలా క్యాన్సర్‌తో బాధ పడేవారికి ధైర్యాన్ని ఇచ్చారు.

ఉత్తమ ప్రదర్శనగా 'నాన్నా నేనొచ్చేస్తా'

ముగిసిన పుచ్చలపల్లి సుందరయ్య కళానిలయం నాటికల పోటీలు

యడ్లపాడు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : యడ్లపాడు పుచ్చలపల్లి సుందరయ్య కళానిలయం ఆధ్వర్యంలో ఈ నెల 4 నుంచి నిర్వహిస్తున్న 22వ జాతీయస్థాయి నాటికల పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. పుచ్చలపల్లి సుందరయ్య కళాప్రాంగణంలోని వేదికపై మూడు రోజులపాటు పది నాటికలు ప్రదర్శితమయ్యాయి. ఈ



'నాన్నా నేనొచ్చేస్తా' నాటిక బృందానికి ఉత్తమ ప్రదర్శన అవార్డును అందజేస్తున్న తెలంగాణకు చెందిన శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ

నాటిక పోటీలకు వివిధ రంగాలకు చెందిన 15మంది న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. మూడు రోజులపాటు జరిగిన ఈ పోటీలలో ఉత్తమ ప్రదర్శనగా అమృతలహరి థియేటర్స్ వారి 'నాన్నా నేనొచ్చేస్తా' నాటిక నిలిచింది. వాస్తవ కథనంతో భావోద్వేగ భరితమైన నటనతో ఇటు న్యాయనిర్ణేతలను అటు ప్రేక్షకుల మనసుల్ని ఆకట్టుకున్న ఈ నాటికకు ఉత్తమ రచయిత, ఉత్తమ దర్శకుడు, ఉత్తమ నటీనటులు బహుమతులు కూడా లభించాయి.

ఉత్తమ ద్వితీయ ప్రదర్శనగా 'నా శత్రువు'

ఉత్తమ ద్వితీయ ప్రదర్శనగా జయభేరి ఆర్ట్స్, హైదరాబాద్‌వారు ప్రదర్శించిన 'నా శత్రువు' నాటిక నిలిచింది. ఉత్తమ సంగీత దర్శకుడు, ఉత్తమ నటి, ఉత్తమ సహాయనటుడు, ఉత్తమ సహాయ నటి బహుమతులు కూడా ఈ నాటికకు దక్కాయి. ఉత్తమ తృతీయ ప్రదర్శనగా సాయి ఆర్ట్స్, కొలకలూరు వారు ప్రదర్శించిన 'జనరల్ బోగీలు' నాటిక ఎంపిక కాగా, ఉత్తమ నటీనటులకు వ్యక్తిగత బహుమతులు లభించాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్రం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ విజేతలకు బహుమతులు అందజేశారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.17,21,419 లక్షలు జమ

ముందుకొచ్చిన ఎంప్లాయిస్ సొసైటీ సంఘం డెయిరీ సభ్యులు

తెనాలిరూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేదలకు వరంలా ఉన్న సీఎం రిలీఫ్ ఫండ్‌కు మేము సైతం అంటూ గుంటూరు జిల్లా ఎంప్లాయిస్ క్రెడిట్ సొసైటీ సంఘం డెయిరీ సభ్యులు రూ. 17,21,419 లక్షలు జమచేశారు. 1982లో స్థాపించిన సొసైటీ అంచలంచెలుగా ఎదిగి 829మంది సభ్యులను నెలకొల్పింది. ఈ సభ్యులకు అత్యవసరమైతే వ్యక్తిగత రుణాలు మంజూరు చేస్తూ వాటిపై వచ్చిన ఆదాయాన్ని దుర్వినియోగం చేయకుండా సభ్యులందరూ కలిసి సీఎం రిలీఫ్ ఫండ్ అకౌంట్‌కు జమచేశారు. ఈ సందర్భంగా సభ్యులు కొత్తరమేష్‌బాబు మాట్లాడుతూ ఎందరో కష్టాల్లో ఉన్న పేదలకు సీఎం రిలీఫ్‌ఫండ్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. తమ సొసైటీ సభ్యులందరూ తమవంతు సహాయ సహకారాలు అందించాలన్న ఉద్దేశంతో వడ్లమూడి కెనరాబ్యాంక్ నుంచి సీఎం సహాయనిధికి రూ. 17,21,419 లక్షలు జమచేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వాసిరెడ్డి చంద్రశేఖర్, చిగురుపాటి శ్రీనివాసరావు, వాసిరెడ్డి జయదత్తు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో డాక్టర్ పోస్టుల భర్తీ

వైద్యవిధాన పరిషత్ జాయింట్ డైరెక్టర్ జనార్ధన్

వినుకొండటౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 173 కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లలో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను త్వరలో భర్తీ చేయనున్నట్లు వైద్యవిధాన పరిషత్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జనార్ధన్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ వైద్యశాలను కాయకల్ప కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన సందర్శించారు. వైద్యశాలను పరిశీలించి పలు విభాగాల వైద్యులకు సూచనలు, సలహాలు అందించారు. బాల్య వివాహాల ద్వారా చిన్నవయసులోనే గర్భవతులు అవుతున్నారని, టీనేజీ మ్యారేజీలను తగ్గించాలని, ఫ్యామిలీ ప్లానింగ్‌పై చైతన్యం కల్పించాలని తెలిపారు. 19 సంవత్సరాల వరకు గర్భవతి కాకూడదని, దీనికి ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన ఛాయ టాబ్లెట్స్‌ను అందుబాటులో ఉంచాలన్నారు. గర్భిణులకు సిజేరియన్ల ద్వారా కాన్పులు చేయడం తగ్గించాలని, దీని ద్వారా పుట్టే పిల్లలకు ప్రమాదం పొంచి ఉందన్నారు. ప్రతి ఒక్కరూ లైఫ్ స్టైల్ ద్వారా తమ ఆరోగ్య సమస్యలను మెరుగుపరచుకోవచ్చని, చిరుధాన్యాలను అధికంగా తీసుకోవాలన్నారు. ఈ ప్రాంతంలో గుండెపోట్లు అధికంగా



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ జనార్ధన్, డాక్టర్ సురేష్‌చంద్ర

నమోదవుతున్నాయని తెలిపారు. త్వరలో వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు చొరవతో ట్రామ కేర్ వైద్యశాలతో పాటు డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు ప్రణాళికలు తయారు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ అధికారి సురేష్‌చంద్ర, డాక్టర్ రాంప్రసాద్, వైద్యాధికారి డాక్టర్ రజాక్, డాక్టర్లు శ్రీనివాసరెడ్డి, బాలునాయక్, సుధాస్రవంతి, హారిక, వెంకటేష్, సుధాకర్, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

డీఆర్‌ఎంగా సుధేష్ణ సేన్ బాధ్యతల స్వీకారం



డీఆర్‌ఎం సుధేష్ణ సేన్‌కి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏడీఆర్‌ఎం సైమన్

గుంటూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్‌గా సుధేష్ణ సేన్ బాధ్యతలు చేపట్టారు. సోమవారం ఉదయం పట్టాభిపురంలోని రైల్‌వికాస్ భవన్‌కు వచ్చిన ఆమె పూర్వ డీఆర్‌ఎం ఎం రామకృష్ణ నుంచి ఛార్జ్ తీసుకొన్నారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు రైల్వే అధికారులు, యూనియన్ల నాయకులు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. సుధేష్ణ సేన్ 1996 బ్యాచ్‌కు చెందిన ఇండియన్ రైల్వే అకౌంట్స్ సర్వీసు అధికారిణి. ఆమె గతంలో న్యూఢిల్లీలోని నార్తర్న్ రైల్వేలో ఆర్థిక సలహాదారుగా, చీఫ్ అకౌంట్స్ అధికారిగా విధులు నిర్వహించారు. ఆర్థిక నిర్వహణ, పరిపాలన విధానంలో విశిష్టమైన కెరీర్‌ని ఆమె నిర్మించుకున్నారు. రైల్వే ఫైనాన్స్‌లో తన వ్యూహాత్మక దృష్టి, నాయకత్వంతో ఖ్యాతిని సంపాదించి పెట్టారు. ఆర్థిక శాస్త్రంలో అండర్ గ్రాడ్యుయేట్ డిగ్రీ, పబ్లిక్ పాలసీలో మాస్టర్స్ డిగ్రీని పూర్తి చేసి తొలుత నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్‌లో ప్రొఫెసర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. అలానే రైల్వేలో చేరిన తర్వాత తర్వా సెంట్రల్ రైల్వేస్ ముంబైలో, భోపాల్, జబల్‌పూర్, సౌత్ ఈస్టర్న్ రైల్వే కోల్‌కతాలోని వెస్టు సెంట్రల్ రైల్వేలోనూ బాధ్యతలు నిర్వహించారు. ముందుకు సాగుతుండండి... నేర్చుకొంటూ ఉండండి అన్న సిద్ధాంతాన్ని సుధేష్ణ సేన్ ఎక్కువగా నమ్ముతారు. ట్రెక్కింగ్, దూర ప్రాంతాలకు ప్రయాణం, సంగీతాన్ని ఎక్కువగా ఆస్వాదిస్తారు. డీఆర్‌ఎంని కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసిన వారిలో ఏడీఆర్‌ఎం కే సైమన్, గతిశక్తి చీఫ్ ప్రాజెక్టుల మేనేజర్ మనోహర్‌రెడ్డి, వివిధ విభాగాల సీనియర్ అధికారులు జేవీ అనూష, ప్రదీప్‌కుమార్, షాబాజ్ హనూర్, కమలాకర్‌బాబు తదితరులు ఉన్నారు.

ప్రధాని సభకు ప్రత్యేకాధికారిగా వీరపాండ్యన్

గుంటూరు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): అమరావతిలో జరగనున్న ప్రధాన మంత్రి సభకు ప్రత్యేక అధికారిగా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండ్యన్‌ను నియమించారు. ఈ నేపథ్యంలో ఆయన ప్రధాని సభ జరిగే ప్రాంతాన్ని సోమవారం పరిశీలించారు. రాష్ట్ర రాజధాని అమరావతిలో ప్రభుత్వం చేపట్టబోతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రధాని చేతుల మీదుగా ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం భావించింది. ఈ నేపథ్యంలో పీఎంఓ నుంచి ఆమోదం కూడా లభించింది. ఈ నెల 23వ తేదీ తరువాత ప్రధాని రాజధాని అమరావతికి వచ్చి అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తారని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో సభ నిర్వహణ బాధ్యతలను ప్రత్యేక అధికారి జీ వీరపాండ్యన్‌కు రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది. సభ ఏర్పాట్లలో భాగంగా సోమవారం ఆయన రాజధాని పరిధిలోని వెలగపూడిలో పర్యటించారు. ప్రస్తుత సచివాలయానికి వెనుక భాగంలో 250 ఎకరాల్లో ప్రధాని సభకు ఏర్పాట్లు చేయనున్నారు. ఆ ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం గుంటూరుజిల్లా ఎస్పీ సతీశ్‌కుమార్, జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజలతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఏర్పాట్ల గురించి వారితో చర్చించారు. కాగా ప్రధాని పర్యటన ఇప్పటికే ఖరారు కావడంతో సభ నిర్వహణా కమిటీలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. ఉన్నతాధికారులకు పలు రకాల బాధ్యతలను అప్పగిస్తోంది.

వ్యక్తిగత గొడవల నేపథ్యంలో యువకుడి హత్య

● 24 గంటల్లోపే నిందితుల అరెస్టు

తాడేపల్లి టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత గొడవలు, ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో ఓ యువకుడిని కత్తితో దారుణంగా హత్య చేసిన సంఘటన తాడేపల్లిలో సోమవారం ఉదయం జరిగింది. సీఐ కళ్యాణరాజు తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు ఇట్టా వర్ధన్ (22)ను హత్య చేసిన తొత్తుక భరత్ అలియాస్ బంటి మరికొందరు ఇటీవల జరిగిన కుంభమేళాలో పాల్గొనేందుకు ప్రయాగ్‌రాజ్ వెళ్లారు. అక్కడ వస్తువులు, దుస్తులు పోయాయని ఒకరినొకరు దూషించుకోవడంతో వర్ధన్, భరత్‌లకు మధ్య ఘర్షణ జరిగింది. తీవ్రంగా కొట్టుకున్నారని కుటుంబసభ్యులు తెలిపారు. అక్కడ గొడవలు, పాత ఆర్థిక



నిందితుల వివరాలు తెలుపుతున్న డీఎస్పీ మురళీకృష్ణ, చిత్రంలో సీఐ, ఎస్ఐ

లావాదేవీల నేపథ్యంలో కక్ష పెంచుకున్న భరత్ మరో వ్యక్తి కలిసి స్థానిక పట్టాభి రామయ్య కాలనీలోని మృతుడి నివాసంలోనే తెల్లవారుజామున 1.30 గంటల సమయంలో కత్తితో విచక్షణా రహితంగా దాడి చేయడంతో వర్ధన్ తీవ్రంగా గాయ పడ్డాడు. కుటుంబసభ్యులు కేకలు వేయడంతో నిందితులు పరారయ్యారు. చికిత్స నిమి త్తం 108లో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలోనే మృతి చెందినట్టు ప్రభుత్వాస్ప త్రి వైద్యులు నిర్ధారించినట్టు సీఐ కళ్యాణరాజు తెలిపారు. మృతుడి అక్క రుద్రవేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు. జరిగిన ఘటనపై మృతుడి అక్క రుద్రవేణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఈ కేసులో నిందితులైన తొత్తుక భరత్ అలియాస్ బంటి, ఇసుకపల్లి ప్రకాష్‌లను సోమవారం రాత్రి పోలీసులు అరెస్టు చేసినట్లు నార్తు జోన్ డీఎస్పీ మురళీకృష్ణ తెలిపారు. 24 గంటల్లోపే కేసును ఛేదించిన సీఐ కళ్యాణ్‌రాజు, ఎస్ఐలను ఉన్నతాధికారులు అభినందించారు.

చకచకా రైతుల ప్లాట్ల రిజిస్ట్రేషన్లు

● వైసీపీ ప్రభుత్వంలో చెప్పులరిగేలా తిరిగినా కాని రిజిస్ట్రేషన్లు
● కూటమి పాలనలో 87 శాతం పూర్తి

తుళ్లూరు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి రైతులకు కేటాయించిన రిటర్నబుల్ ప్లాట్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతమైంది. గత టీడీపీ ప్రభుత్వంలో ఈ-లాటరీ పద్ధతిలో స్వయంగా సీఎం చంద్రబాబునాయుడు ప్లాట్ల కేటాయింపును ప్రారంభించారు. ఆ తరువాత అధికారులు గ్రామాల వారీగా కేటాయింపులు చేశారు.



తుళ్లూరు సీఆర్డీఏ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియలో రైతులు

వాణిజ్య, నివాస ప్లాట్లు కలిపి రాజధాని 29 గ్రామాలకు చెందిన రైతులకు 68 వేల ప్లాట్ల కేటాయించారు. ఆ సమయంలోనే 50 శాతం రిజిస్ట్రేషన్‌లు చేశారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత మా ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయండని ఎంత అడిగినా కానీ నెలకు ఒకటి రెండు ప్లాట్ల కన్నా చేయలేదు. అది కూడా లంచాలు తీసుకొని ఒకటికి పది సార్లు రైతులను కార్యాలయాలు చుట్టూ తిప్పి చేశారనే ఆరోపణలున్నాయి. తిరిగి చంద్రబాబునాయుడు అధికారంలోకి రావటంతో అమరావతి అభివృ ద్ధిపై దృష్టి పెట్టడంతో అధికార యంత్రాంగం కదిలింది. గత టీడీపీ ప్రభుత్వంలో అనంతవరం, తుళ్లూరు, మందడం గ్రామాల్లో ఏర్పాటు చేసిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలే కాక ఇప్పుడు ల్యాండు పూలింగ్ యూనిట్ ఆఫీసుకు ఒకటి చొప్పున 9 చోట్ల రిజిస్ట్రేషన్ కేంద్రాలు ఏర్పాటు చేసి రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేశారు. ఇప్పటి వరకు 87 శాతం ప్లాట్ల రిజిస్ట్రేషన్లు పూర్తి చేశారు. మిగిలి ఉన్నవి కూడా త్వరగా పూర్తి చేయాలని సీఆర్డీఏ అధికారులు ప్రయత్నం చేస్తున్నారు.

అసభ్యకర పోస్టులు.. ముగ్గురిపై కేసు నమోదు

చిలకలూరిపేట, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు, వారి కుటుంబ సభ్యులపైన సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టులు పెట్టిన ముగ్గురిపై చిలకలూరిపేట రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. వారిలో మానుకొండ శ్రీకాంత్ రెడ్డి (మానుకొండవారిపాలెం), దొడ్డా రాకేష్ గాంధీ (చిలకలూరిపేట), కందుల శ్రీకాంత్ (చిలకలూరిపేట) ఉన్నారని చిలకలూ రిపేట రూరల్ సీఐ సుబ్బనాయుడు సోమవారం చెప్పారు. చిలకలూ రిపేట మండలం గొట్టిపాడుకు చెందిన ఎం శివ కోటేశ్వరరావు ఫిర్యాదు మేరకు వీరిపై కేసు నమోదు చేసినట్టు ఆయన తెలిపారు.

పది క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

పొన్నూరుటౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మాచవరం గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న పది క్వింటాళ్ల రేషన్ బియ్యం ఆటోను ఆదివారం రాత్రి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పొన్నూరు రూరల్ ఎస్ఐ గండు కిరణ్ కథనం ప్రకారం రేషన్ బియ్యం తరలిస్తున్నారనే సమాచారంతో సోదాలు నిర్వహిస్తుండగా ఆటోలో 10 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గుర్తించి కేసు నమోదు చేసి ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

గాలి దుమారం

● మోస్తరుగా వర్షం
● తాడికొండ, మంగళగిరి, తుళ్లూరులో విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుంటూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఉదయం నుంచి ఎండ మండిపోగా సాయంత్రం 6 గంటల సమయం దాటిన తర్వాత జిల్లాలోని కొన్ని మండలాల్లో గాలి దుమారం రేకెత్తించింది. సోమవారం సాయంత్రం ఆకాశంలో దట్టమైన కారుమబ్బులు కమ్ముకొని భారీ వర్షం కురుస్తుందేమోనన్న వాతావరణాన్ని తలపించింది. అయితే గాలి బలంగా వీచడంతో పలుచోట్ల చెట్లు నేలకొరిగాయి. హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు ఊడి పడ్డాయి. విద్యుత్ తీగలు తెగిపడటంతో పలు మండలాల్లో కరెంట్ సరఫరా నిలిచిపోయింది. సాయంత్రం 6.30 గంటలకు నిలిచిపోయిన విద్యుత్ సరఫరా రాత్రి 8.30 గంటల వరకు కూడా పునరుద్ధరణ జరగలేదు. దీనిపై విద్యుత్ శాఖ అధికారులను వివరణ కోరగా చాలా చోట్ల రాత్రి 8 గంటల లోపే విద్యుత్ సరఫరా పునరుద్ధరించామని, కొన్ని చోట్ల మాత్రం రాత్రి 9 గంటలకు సప్లై ఇస్తామన్నారు. గాలి కారణంగా దుమ్ము, ధూళి ఎగిసిపడుతూ రోడ్లపై పాదచారులు, ద్విచక్ర వాహనదారుల కళ్లల్లోకి చేరడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గాలి దుమారం మంగళగిరి, తాడేపల్లి, తుళ్లూరు, తాడికొండ, గుంటూరు నగరం, పెదకాకాని, వట్టిచెరుకూరులోనే ఎక్కువగా ప్రభావం చూపించింది. తెనాలి పరిసర ప్రాంతాల్లో ఎలాంటి గాలి/వర్షం కురవలేదు. వర్షం రాక ముందు ఆకాశంలో మెరుపులు మెరిశాయి. కొన్ని గ్రామాల్లో ఉరుములు ఉరిమాయి. భారీ వర్షం తప్పదనుకున్న తరుణంలో గాలి కారణంగా వర్షం వెలిసిపోయింది. బలమైన ఈదురుగాలులు వీధి వ్యాపారులకు నష్టం కలిగించాయి. ఇంటర్నెట్ సర్వీసు ప్రొవైడర్ల కేబుల్స్ ఎక్కడికక్కడ తెగిపోయాయి. దీంతో కొన్ని చోట్ల ఇంటర్నెట్ సేవలకు ఆటంకం ఏర్పడింది.



గుంటూరు నగరంలో ఆకాశంలో మెరుస్తున్న మెరుపులు

హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌గా జిల్లా జడ్జి పార్థసారథి

● గుంటూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా కల్యాణ చక్రవర్తి



కల్యాణ చక్రవర్తి

గుంటూరు(లీగల్), ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా పనిచేస్తున్న వైవీఎస్‌బీజీ పార్థసారథిని రాష్ట్ర హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌గా బదిలీ చేస్తూ హైకోర్టు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన స్థానంలో ప్రస్తుతం విజయనగరం జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా పనిచేస్తున్న బీ సాయి కల్యాణ చక్రవర్తిని గుంటూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా నియమించింది. రాష్ట్రంలోని వివిధ కోర్టులో పనిచేస్తూ ఆ ప్రాంతంలో మూడు సంవత్సరాలు పూర్తి చేసుకున్న పలువురు జిల్లా జడ్జిలను మరో చోటికి బదిలీ చేస్తూ రాష్ట్ర హైకోర్టు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. గుంటూరు జిల్లాకు సంబంధించి ఇండస్ట్రియల్ ట్రిబ్యునల్ చైర్మన్‌గా పని చేస్తున్న డి. తిరుమలరావును శ్రీకాకుళం జిల్లా లక్ష్మీపేటలో గల ఐదవ అదనపు జిల్లా కోర్టుకు బదిలీ చేసింది. ఖాళీ అయిన ఆయన స్థానంలో ప్రస్తుతం ఒంగోలు 3వ అదనపు జిల్లా జడ్జిగా పని చేస్తున్న డి. రాములును నియమించింది. గుంటూరు పోక్సో కోర్టులో స్పెషల్ జడ్జిగా పనిచేస్తున్న ఏ అనితను విజయవాడలోని ప్రజా ప్రతినిధుల నేరాల విచారణ స్పెషల్ కోర్టుకు బదిలీ చేసింది. ఖాళీ అయిన ఆమె స్థానంలో ప్రస్తుతం నెల్లూరులోని 7వ అదనపు జిల్లా జడ్జిగా పనిచేస్తున్న షమీ పర్వీన్ సుల్తానా బేగంను నియమించారు. ప్రస్తుతం విజయవాడలోని ఏసీబీ కోర్టు జడ్జిగా పనిచేస్తున్న బి.సత్య వెంకట హిమబిందును రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ మెంబర్ సెక్రటరీగా బదిలీ చేశారు.

క్రీడలతోనే మానసిక ఉల్లాసం : ఎమ్మెల్యే నరేంద్ర

పెదకాకాని, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): క్రీడలతోనే మానసిక ఉల్లాసం కలుగుతుందని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ తెలిపారు. సోమవారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వికాస ఆధ్వర్యంలో నిర్వహించిన ఆటల పోటీలలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భం



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్

గా నరేంద్ర కుమార్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయాలలో ఇలాంటి ఆటలు పోటీలు నిర్వహించడం చాలా శుభ పరిణామమని.. ఇలాంటి కార్యక్రమాలు ప్రతి ఏడాది నిర్వహించాలన్నారు. తద్వారా ఉద్యోగుల మధ్య సఖ్యత పెరిగి మనస్పర్థలు లేకుండా పనిచేసేందుకు ఉపయోగపడుతుందన్నారు. ఎప్పుడూ కార్యాలయంలోనే కూర్చొని పనిచేస్తున్న ఉద్యోగులకు ఇలాంటి ఆట పోటీలతో శారీరక దృఢత్వం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌యూ ఇన్చార్జి వీసీ ఆచార్య గంగాధరరావు, రెక్టార్ ఆచార్య రత్న షీలామణి, రిజిస్టర్ ఆచార్య జీ సింహచలం, యూనివర్సిటీ అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఉరి వేసుకుని విద్యార్థిని ఆత్మహత్య

సత్తెనపల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని క్రిష్టియన్‌పేటకు చెందిన మాజీ కౌన్సిలర్ బలిజేపల్లి సురేష్ కుమార్ కుమార్తె సాహితీ సంజన(19) సోమవారం తన పిన్ని గృహంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు ఏరియా వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. సాహితీ సంజన శ్రీకాకుళం జిల్లాలో ఏజీబీఎస్సీ మొదటి సంవత్సరం పూర్తి చేసింది. ఆత్మహత్యకు గల కారణాలు తెలియ రాలేదు. విద్యార్థిని తండ్రి సురేష్‌కుమార్ ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సురేష్ కుమార్ టీడీపీ క్రియాశీలక నేత కావటంతో వివిధ పార్టీల నేతలు సంజన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

ఎరువుల వ్యాపారి అదృశ్యం?

◆ రూ. 2.50 కోట్ల అప్పులు ◆ రూ. 60 లక్షలకు రైతులకు అగ్రిమెంట్

మాచర్ల రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లపల్లిగ్రామానికి చెందిన ఎరువుల వ్యాపారి రూ. 2.50 కోట్ల మేర అప్పులు చేసి పరారైనట్లు విశ్వసనీయ సమాచారం. ఎరువుల వ్యాపారి తాళ్లపల్లి గ్రామానికి చెందిన సుమారు 100 మంది రైతుల వద్ద పంట, నగదు రూపేణా సుమారు రూ. 2.50 కోట్ల మేర అప్పులు చేశారు. తనకున్న పొలాలు, స్థలాలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని రైతులను కోరి ఈ మేరకు అగ్రిమెంట్ కూడా రాసినట్లు తెలుస్తోంది. ఈ ఆస్థుల విలువ సుమారు రూ. 60 లక్షల దాకా ఉన్నట్లు సమాచారం.



రెవెన్యూ కార్యాలయం వద్ద అప్పులిచ్చిన రైతులు

సోమవారం రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉండగా ఆ వ్యాపారి ఇంటికి తాళాలు వేసి కనిపించకుండా పోయాడని అప్పులిచ్చిన రైతులు ఆందోళన చెందుతున్నారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ రైతులు సోమవారం పట్టణంలోని మండల రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ బందెల కిరణ్‌కుమార్‌కు, రూరల్ సీఐ నఫీజ్‌బాషాకు వినతిపత్రం అందించారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం సోమవారం నాటికి 516.30 అడుగులు ఉంది. ఇది 142.61 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 2053 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 4881 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 8734 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	121, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00

1,37,288 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 1,53,787 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,37,288 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 64,276 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9500	13000
నంబరు. 5	10000	13400
273	10000	12900
341	10500	14000
4884	10000	11900
సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10300	13500

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
షార్క్-1	10500	12400
బ్యాడిగి 355	10000	13300
సింజెంటా		
బ్యాడిగి 5531	--	--
దేవనూరు డీలక్స్	10300	12700
ఆర్మూరు	9800	11000
తాలుకాయలు	4500	6300

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె



జీబీసీ రోడ్డుపై పైపులైన్ మరమ్మతుల కోసం తవ్విన గుంతను పరిశీలిస్తున్న కమిషనర్ రఘునాథరెడ్డి

మరోచోట పైపులైన్ లీక్

బాపట్ల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో తాగునీటి పైపులైన్ లీక్‌ల పరంపర కొనసాగుతూనే ఉంది. ఒకచోట మరమ్మతులు చేస్తే మరోచోట లీక్‌లు ఏర్పడటం, నీరు వృధా అవ్వటం, లీక్‌లు అయిన చోట నీటిలో మట్టి కలిసి కలుషితమవ్వటం పరిపాటిగా మారింది. మున్సిపల్ కార్యాలయం దగ్గర ఏబీఎం స్కూల్ ఎదురు ఇటీవల జీబీసీరోడ్డుపై పైపులైన్ మరమ్మతుల కోసం రోడ్డును ధ్వంసం చేసి మట్టితో పూడ్చారు. మరలా దానికి ఎదురు ఉప్పరపాలెం వెళ్ళే రోడ్డు ఎదురుగా జీబీసీ రోడ్డుపై మరో గుంత తవ్వారు. ఈ విధంగా నిత్యం పట్టణంలో పైపులైన్‌ల మరమ్మతులు చేస్తూనే ఉన్నారు. కమిషనర్ జి.రఘునాథరెడ్డి సోమవారం ఆయా ప్రాంతాలలో పర్యటించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. లీక్‌లు సరిచేయాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశించారు. హోంకంపోస్ట్ గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ స్వచ్ఛందంగా నిషేధించేలా ప్రజలలో చైతన్యం తీసుకురావాలన్నారు. 33వ వార్డు చెంగల్రాయుడుతోటలో సమాధులతోట పరిశీలించి శానిటేషన్ సిబ్బందికి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డీఈ ఎస్ఎస్ కృష్ణారెడ్డి, శానిటరి ఇన్‌స్పెక్టర్‌లు సీహెచ్ కరుణ, డి.శ్రీనివాసరావు సిబ్బంది పాల్గొన్నారు.

కృష్ణారెడ్డి మృతదేహాన్ని సందర్శించిన ఎమ్మెల్యే నరేంద్రవర్మ



కృష్ణారెడ్డి భౌతికకాయాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ

కర్లపాలెం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం మండలం పెదపులుగువారిపాలెం గ్రామానికి చెందిన అక్కల కృష్ణారెడ్డి ఆదివారం విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ సోమవారం బాపట్లలోని ఏరియా వైద్యశాలకు విచ్చేసి అక్కల కృష్ణారెడ్డి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

గిరిజనులు స్వేచ్ఛగా చేపల వేట చేసుకోనివ్వండి

బాపట్ల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : నిరుపేద యానాదులను స్వేచ్ఛగా చేపల వేట చేసుకోనివ్వాలని కోరుతూ సోమవారం ప్రజా సమస్యల పరిష్కారవేదికలో జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్‌కు వినతిపత్రం అందజేశారు. యానాది హక్కుల పరిరక్షణసమితి ఆధ్వర్యంలో బాపట్ల పాతబస్టాండ్ నుంచి కలెక్టరేట్ వరకు బాధిత కుటుంబాలు ప్రదర్శన నిర్వహించారు. యానాది హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పొట్లూరి లక్ష్మయ్య మాట్లాడుతూ వేటపాలెం ఏరియా పరిధిలో నిరుపేద యానాదుల చేపలవేటను అడ్డుకుంటున్నవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సీహెచ్ శంకర రావు, అఖిల భారతరైతుకూలీసంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మేకల ప్రసాద్, పొట్లూరి లక్ష్మయ్య, కొమరగిరి శ్రీను, పొట్టా వెంకటేశ్వర్లు, కొమరగిరి అయ్యప్ప, సైకం, రమేష్, చేవూరి వెంకట్రావు, మల్లవరపు కృష్ణ, పుట్టా వెంకటేశ్వర్లు, కె.శ్రీను, అయ్యన్న, వెంకట్, గుదే రాజారావు, ఎస్‌డీ హాఫీజుల్లా తదితరులు పాల్గొన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్‌కు వినతిపత్రం అందజేశారు.

వేధిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని వినతి

బాపట్ల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసిలో పనిచేసే తన భర్త చనిపోవటంతో ఇల్లుఖాళీ చేసి వెళ్ళిపోవాలంటే ఆడబిడ్డలు, వారి భర్తలు వేధింపులకు గురి చేయటమేకాకుండా తనపై, తనబిడ్డలపై దాడి చేస్తున్నారంటూ ఓ మహిళ ప్రజాసమస్యల పరిష్కారవేదిక వద్ద కన్నీరు పెట్టుకుంది. వేమూరు మండలం పెదపులివర్రు దగ్గర జీడుగువారిపాలెంకు చెందిన నిమ్మగడ్డ సునీత భర్త గుంటూరు ఆర్టీసీలో మెకానిక్‌గా పనిచేస్తూ చనిపోయాడు. ఆమెకు ఒకకుమార్తె, ఒకకుమారుడు ఉన్నాడు. ఆమె ఆడ బిడ్డ మేరుగ కరుణశ్రీ, రవితేజలతోపాటు ప్రసన్న, శ్రీనులు కలిసి తమపై దాడి చేస్తున్నారని ఇల్లు వదిలి పుట్టింటికెళ్ళమని బెదిరిస్తున్నారంటూ జిల్లా పోలీసు కార్యాలయంలో వినతిపత్రం ద్వారా వివరించింది. సోమవారం తన తల్లి కారుమంచి సుజ్ఞానమ్మతో కలిసి ప్రజా సమస్యల పరిష్కారవేదికలో అర్జీ అందజేసింది.

దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని...

ఏరియావైద్యశాలలో సైకిల్ స్టాండ్ ఏర్పాటు చేసుకొని దశాబ్దకాలంగా జీవనం సాగిస్తున్న తనపై దాడిచేసి అక్రమంగా సైకిల్ స్టాండ్ తొలిగించారంటూ నర్రావుల వెంకట్రావు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కారవేదికలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చినపోతుల హరిబాబు, వైసీపీ పట్టణాధ్యక్షుడు కాగిత సుధీర్‌బాబు, దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు చల్లా రామయ్య, కర్లపాలెం మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సుబ్బారావు, సోహిత్, జోగి రాజా, ఏడుకొండలురెడ్డి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అర్జీదారుల ఆకలి తీరుస్తున్న అక్షయపాత్ర ఆహారం



కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన భోజనం చేస్తున్న ఫిర్యాదుదారులు

బాపట్ల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అనేక ప్రాంతాలు నుంచి కలెక్టరేట్, జిల్లా పోలీసు కార్యాలయానికి ప్రతి సోమవారం పెద్ద ఎత్తున ప్రజలు విచ్చేసి ప్రజా సమస్యల పరిష్కారవేదికలో తమ సమస్యలను వివరిస్తున్నారు. కలెక్టరేట్ పరిసరాలలో హోటల్స్ అందుబాటులో లేకపోవటంతో కలెక్టర్ జె.వెంకటమురళి చొరవ తీసుకొని ప్రతి సోమవారం ఇక్కడ భోజనం ఏర్పాటు చేయించారు. దీంతో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి కలెక్టరేట్‌కు వచ్చేవారందరికి అక్షయపాత్ర వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భోజనాన్ని బాపట్ల రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్మన్ బి.ఎస్.నారాయణభట్టు సభ్యులతో కలిసి అందిస్తున్నారు. తాగునీటి వసతి కూడా ఏర్పాటు చేయటంతో దూరప్రాంతాలు నుంచి వచ్చేవారంతా సంతృప్తిగా భోజనం చేసి సంతోషంగా వెళుతున్నారు.

ఈ-శ్రమ్ పోర్టల్‌లో కార్మికులు నమోదు చేసుకోవాలి

బాపట్ల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : కేంద్రప్రభుత్వం అసంఘటిత రంగ కార్మికుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈ-శ్రమ్ పోర్టల్‌లో ఇప్పటి వరకు నమోదు చేసుకోని జొమాటో, అమెజన్, స్విగ్గి, ఫ్లిప్‌కార్టు తదితర ప్లాట్‌ఫామ్ కార్మికుల కోసం ఈనెల 7వ తేదీ నుంచి 17వ తేదీ వరకు ప్రత్యేక నమోదుకు శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరాలలో తమ పేర్లు నమోదు చేయించుకోవాలని ఆమె కోరారు. వివరాలకు కార్మిక శాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

నేడు శ్రీ లింగోద్భవస్వామి కల్యాణ మహోత్సవాలు

పిట్టలవానిపాలెం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందోలు గ్రామంలో ఉన్న ప్రముఖ శైవక్షేత్రమైన శ్రీలింగోద్భవ స్వామి దేవస్థానంలో ఈనెల 8 నుంచి 14వ తేదీ వరకు అత్యంత వైభవోపేతంగా కల్యాణ మహోత్సవాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి తెలిపారు. తొలుత స్వామివారిని పెండ్లి కుమారునిగా చేయట, రెండో రోజు అంకురార్పణం, గజారోహణం, నెమలివాహన ఉత్సవం, మూడో రోజు హంస వాహనోత్సవం, నాల్గవ రోజు సాయంత్రం స్వామి వారికి ఎదురు కోలోత్సవం, రాత్రి 8 గంటలకు కల్యాణమహోత్సవాలు, 5వరోజు సాయంత్రం రథోత్సవం, 6వరోజు అవరోహణ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకోవాలని ఆయన కోరారు.

ఏరియా వైద్యశాల పిల్లల వార్డులో ఏసీలు పునఃప్రారంభం

బాపట్ల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల ఏరియా వైద్యశాలలోని చిన్నపిల్లల వార్డులో మరమ్మతులకు గురైన నాలుగు ఏసీలను రిపేరు చేయించి సోమవారం పునఃప్రారంభించారు. వేసవి తీవ్రతతో వార్డులోని చిన్న పిల్లలు, బాలింతలు, గర్భిణులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు వీటిని తిరిగి ఏర్పాటు చేసినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దార్ద తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి కమిటీ సభ్యులు గుంద్రెడ్డి శ్రీహరి, నాయకులు పాల్గొన్నారు.

చందోలు ఎస్ఐగా మర్రి వెంకటశివకుమార్

పిట్టలవానిపాలెం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : చందోలు పోలీసుస్టేషన్‌లో నూతన ఎస్ఐగా మర్రి వెంకటశివకుమార్ సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలపై దృష్టి సారిస్తానని తెలిపారు.

అర్జీలు త్వరగా పరిష్కరించాలి

● కలెక్టర్ జె.వెంకటమురళి



అర్జీదారుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల,ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారవేదికకు వచ్చే అర్జీదారులు సంతృప్తి చెందేవిధంగా సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ జె.వెంకటమురళి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి అర్జీదారులు పెద్దఎత్తున వచ్చి అర్జీల ద్వారా తమ సమస్యలను కలెక్టర్‌కు వివరించారు. అర్జీదారుల ద్వారా ఫీడ్‌బ్యాక్ తీసుకొని ప్రభుత్వానికి పంపాలని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమాలు, అర్జీలను పరిష్కరించిన తర్వాత సంబంధిత పంచాయతీ కార్యదర్శులు గ్రామాలకు వెళ్ళి లబ్దిదారులతో మాట్లాడి ఆడియో తీసుకొని వారితో సెల్ఫీ దిగి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. జిల్లాలో జరిగే డిఆర్‌సి సమావేశంలో ప్రజాప్రతినిధులు లేవనెత్తిన అంశాలపై తీసుకున్న చర్యల రిపోర్ట్‌లను తయారు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, ఆర్డీవో పి.గ్లోరియా, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయాధికారి రామకృష్ణ, జిల్లా రవాణాశాఖాధికారి పరందామరెడ్డి, జిల్లా అటవీశాఖాధికారి ఎల్.భీమయ్య, జిల్లా గ్రామీణ నీటిసరఫరా శాఖ ఎస్ఈ అనంతరాజు, జిల్లా సాంఘిక సంక్షేమశాఖాధికారి జె.రాజాదెబోరా, బీసీ సంక్షేమశాఖాధికారి శివలీల, గృహనిర్మాణశాఖ పీడీ వై.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన కుటుంబాలకు నివేశన స్థలాలు కేటాయించాలి

సూర్యలంక సముద్రతీరంలో దశాబ్దాలుగా నివాసం ఉంటున్న 20 గిరిజన, మత్స్యకార కుటుంబలవారికి నివేశన స్థలాలు కేటాయించాలని జైభీమ్‌రావ్ భారతపార్టీ జిల్లా అధ్యక్షులు పర్రె కోటయ్య సోమవారం కలెక్టర్ జె.వెంకటమురళిని కలిసి వినతిపత్రం అందజేశారు. నివేశన స్థలాలు కేటాయించి పక్కా ఇల్లు నిర్మించాలన్నారు. దీనిపై స్పందించిన కలెక్టర్ అర్హులందరికి నివేశన స్థలాలిచ్చేవిధంగా చూడాలని రెవెన్యూఅధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కొచ్చెర వినయరాజు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించాలి

ఈనెల 14న జరగనున్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతిని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని దళిత ప్రజా సంఘాల నాయకులు సోమవారం కలెక్టర్ జె.వెంకటమురళిని కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్ ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహిస్తామన్నారు. దీనిపై సోషల్ వెల్ఫేర్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ఏఎస్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జి.చార్వాక, మాలమహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి శీలం రోజన్‌బాబు, జైభీమ్ భారత పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు కొచ్చెర వినయ్‌రాజు, శ్యామ్, దాసి నాగేశ్వరరావు, మోజెస్, కంచర్ల వెంకటగిరి, నతానీయేలు, గుజ్జర్లపూడి పద్మ, చైతన్య ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారవేదికకు ఏడు అర్జీలు : ఆర్డీవో



ప్రజాసమస్యల పరిష్కారవేదికలో ఆర్డీవో రామలక్ష్మికి అర్జీలను అందిస్తున్న ప్రజలు

రేపల్లె, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి) : ప్రజాసమస్యల పరిష్కారవేదికకు ఏడు అర్జీలు అందాయని ఆర్డీవో రామలక్ష్మి అన్నారు. సోమవారం ఆర్డీవో కార్యాలయంలో జరిగిన ప్రజాసమస్యల పరిష్కారవేదికకు డివిజన్ పరిధిలో ఏడు అర్జీలు అందాయి. ఆమె మాట్లాడుతూ కొల్లూరు మండలం చిన్న పులివర్రు రెవెన్యూ గ్రామాన సర్వేనెం.271ను 22ఏను తొలగించాల్సిందిగా తాతాసాయిబాబు కోరారు. పట్టణానికి చెందిన షేక్ ఖాదర్‌వలీ, షేక్‌ఖాసీం నగరం మండలం పెదమట్లపూడి గ్రామంలో 35 సెంట్లు భూమికలదని, భూమిని కొలిచి హద్దులు చూపించాల్సిందిగా కోరారు. పట్టణంలోని 2వ వార్డులో ప్రజలు సిమెంట్ రోడ్డును ఆక్రమించుకున్నారని, వాటిని తొలగించాలని అర్జీ దాఖలు చేశారు. బేతపూడి గ్రామానికి చెందిన పరుచూరి కృష్ణకుమారి అడంగల్‌లో 6/8 కాలంను మార్చాల్సిందిగా కోరారు. మండలంలోని పోటుమెరకకు చెందిన గరికపాటి వెంకటేశ్వరరావు సర్వేనెం.117లో 2.42 సెంట్లు భూమి కలదని, 2.30 సెంట్లు మాత్రమే ఆన్‌లైన్‌లో చూపెడుతుందని, పదిసెంట్లు ఆన్‌లైన్‌లో ఎక్కించాలని కోరారు. విశ్వేశ్వరం గ్రామానికి చెందిన బొర్రా గోవిందమ్మ సర్వేనెం.32/2లో 80 సెంట్లు పొలం ఉందని ఆన్‌లైన్ చేయాలని కోరారు. వీటిపై విచారించి తక్షణమే ఆయా అధికారులకు తెలిపి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా గవిని



ఆరవ అదనపు జిల్లా జడ్జి కె.శ్యాంబాబుకు తన నియామకపత్రాన్ని అందజేస్తున్న గవిని శ్రీనివాసరావు

బాపట్ల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లా అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా గవిని శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. తన నియామక పత్రాలను 6వ అదనపు జిల్లా జడ్జి కె.శ్యాంబాబుకు అందజేశారు. అనంతరం కోర్టు ప్రాంగణంలో ఆయనకు ఏర్పాటు చేసిన ఛాంబర్‌ను సీనియర్ అడ్వకేట్ విన్నకోట సత్యప్రసాద్ ప్రారంభించారు. జిల్లా ఏర్పడిన తర్వాత మొదటి ఏపీపీగా నియమించటంతో తన నియామకానికి సహకరించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం తరుపున న్యాయమైన అంశాలలో ఎలాంటి రాజీలేకుండా పని చేస్తానని స్పష్టం చేశారు. ఏపీపీ శ్రీనివాసరావును బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కంచర్ల అవినాష్, సీనియర్ న్యాయవాదులు నందనవనం ప్రసాద్, ఆర్.వెంకటేశ్వర్లు, రఘురామ్, నల్లమోతు సుబ్బారావు, జమ్మద్దీన్‌బాషా, దుగ్గమల్లి కిరణ్‌కుమార్, అంబటి మురళీకృష్ణ, కళ్ళం హరినాధరెడ్డి, ప్రముఖులు చాపల సుబ్రహ్మణ్యం, చల్లా రాజు, ఇమ్మడిశెట్టి కోటేశ్వరరావు, శీలం శ్రీనివాసరావు తదితరులు అభినందించారు.

ప్రపంచ ఆరోగ్య దినోత్సవం

బాపట్లరూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్స్, అపోలో స్పెక్ట్రా హాస్పటల్, చీరాల అనుసంధానంతో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం నిర్వహించారు. అపోలో స్పెక్ట్రా హాస్పటల్ చీఫ్ గైనకాలజిస్ట్ డాక్టర్ నిరూపమా ఒత్తిడిని అధిగమించి ప్రతి విద్యార్థి ఆరోగ్యం కాపాడుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.రమాదేవి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కె.రాజేంద్ర, బాలికల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ వై.శృతి, డీన్ ఆఫ్ స్టూడెంట్ ఎఫైర్స్ డి.నిరంజన్‌బాబు పాల్గొన్నారు.

శ్మశాన స్థలానికి పట్టా ఇవ్వాలి

కర్లపాలెం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ఎస్టీ యానాదుల శ్మశాన వాటికకు పట్టా ఇవ్వాలని ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, యానాదుల సంఘాల మహాకూటమి అధికార ప్రతినిధి యాకసిరి నరసింహారావు అన్నారు. సోమవారం కర్లపాలెం లంక ఛానల్ కట్టపై ఉన్న ఎస్టీ కులస్తులకు చెందిన గ్రామస్థులతో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. నరసింహారావు మాట్లాడుతూ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి శ్మశాన స్థలానికి పట్టా ఇవ్వాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో వై.నాగేశ్వరరావు, కల్యాణి, మస్తాన్, శివయ్య, జి.తిరుపతమ్మ, హైమావతి, వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న భరతనాట్య ప్రదర్శన

బాపట్ల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రథంబజారులో శ్రీవిశ్వహిందుపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీరామనవమి ఉత్సవాలలో భాగంగా సోమవారంరాత్రి ఏర్పాటు చేసిన భరతనాట్యం విశేషంగా ఆకట్టుకుంది. వైష్ణవి కూచిపూడి నాట్యకళానికేతన్ ఆధ్వర్యంలో వైష్ణవి శిష్యబృందం ప్రదర్శించిన భరతనాట్యం ఆద్యంతం అలరింపచేసింది. ఉదయం శ్రీవిష్ణు సహస్రనామ పారాయణం శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం బురుగు సంగమేశ్వరశాస్త్రి సౌజన్యంతో ప్రసాద వినియోగం గావించారు. కార్యక్రమాన్ని కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

మత్స్యశాఖ సంయుక్త సంచాలకుడిగా శ్రీనివాస్‌నాయక్

బాపట్ల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లా మత్స్యశాఖ సంయుక్త సంచాలకులుగా కె.శ్రీనివాస్ నాయక్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. తిరుపతి మత్స్యశాఖ ఉపసంచాలకుడిగా పని చేస్తున్న ఆయన పదోన్నతిపై బాపట్లకు వచ్చారు. బాధ్యతలు చేపట్టిన ఆయన కలెక్టర్ జె.వెంకటమురళి, జేసీ ప్రఖర్‌జైన్‌లను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కలు అందజేశారు. జిల్లాలో మత్స్యశాఖకు సంబంధించిన ప్రతి కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు.

అగ్నిబాధిత కుటుంబానికి ఆర్థికసాయం

కర్లపాలెం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నల్లమోతువారిపాలెంలో ఆదివారం రాసూరి సాంబయ్య పూరిల్లు పూర్తిగా దగ్ధమైంది. బాపట్ల జనసేన నాయకుడు, అఖండ ఫౌండేషన్ అధ్యక్షుడు విన్నకోట సురేష్ సోమవారం బాధితుడు రాసూరి సాంబయ్యకు రూ.10 వేల ఆర్థికసాయం, దుప్పట్లు, దుస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి గుంటుపల్లి తులసీకుమారి, నల్లమోతువారిపాలెం గ్రామ అధ్యక్షుడు గరిగంటి శ్రీనివాసరావు, బాపట్ల నియోజకవర్గ జనసైనికులు కారుమూరి అంజనేష్, పసుపులేటి మహేష్, దాసరి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

భూ రీసర్వేతో భూ సమస్యలు పరిష్కారం

వేమూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం నిర్వహిస్తున్న భూ రీసర్వేతో రైతుల అపరిష్కృత సమస్యలు పరిష్కారమవుతాయని పెనుమర్రు గ్రామ సర్పంచ్ కొక్కిలిగడ్డ సుమతి అన్నారు. మండలంలోని పెనుమర్రులో గ్రామ సభను నిర్వహించారు. మండల సర్వేయర్ నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ పాల్గొన్నారు. సమావేశంలో వీఆర్వోలు నరేంద్ర, జితేంద్ర, సర్వేయర్లు షణ్ముఖ, హరిబాబు, చంద్రశేఖర్, గోపి, స్నేహ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సాయి, పంచాయతీ కార్యదర్శి సింధూజ, టీడీపీ నాయకులు మన్నె పసి, రైతులు పాల్గొన్నారు. సమావేశంలో అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

కోదండ రామస్వామికి పట్టాభిషేకం

వేమూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : వేమూరులో ఉన్న శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో సోమవారం వార్షిక శ్రీరామనవమి ఉత్సవాలలో భాగంగా పట్టాభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉత్సవ మూర్తులకు విశేష పూజ జరిపి పవిత్ర జలాలతో కూడిన కలశాలను ఆగమ శాస్త్రం ప్రకారం పూజించారు. పట్టాభిషేక పూజ అనంతరం పానకం, వడపప్పు భక్తులకు వినియోగించారు.

కోరం లేక వాయిదాపడిన సర్వసభ్య సమావేశం

చుండూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం జరగవలసిన సాధారణ సర్వసభ్య సమావేశం కోరం లేకపోవడంతో వాయిదా వేసినట్లు ఎంపీడీవో ఎన్.సుదీప ప్రకటించారు. తిరిగి సమావేశపు తేదీని వెల్లడిస్తామని ఆమె తెలిపారు. సోమవారం జరిగిన సర్వసభ్య సమావేశానికి మండూరు ఎంపీటీసీ, ఎంపీపీ రూబెన్ తప్ప మిగిలిన ఏ ఒక్క సభ్యుడు హాజరు కాకపోవడం ప్రస్తుతం మండలంలో చర్చనీయాంశంగా మారింది.

చలమయ్య సిద్ధాంతికి సత్కారం

భట్టిప్రోలు (కొల్లూ రు), ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : వంగల చలమయ్య సిద్ధాంతిని దేవదాయ ధర్మదాయ అధికారి ఘనం గా సన్మానించారు. సోమవారం ఐలవరంలోని సీతారామ ఆలయంలో శ్రీరామనవమి ఉత్సవాలలో భాగంగా చలమయ్య సిద్ధాంతిని రేపల్లె దేవదాయ ధర్మదాయ శాఖ అధికారి ఎస్.కుమార్‌బాబు దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం జరిగిన శ్రీరామనవమి ఉత్సవాలలో పాల్గొన్నారు. బీసీ సెల్ కార్యదర్శి శివకుమార్, శివప్రసాద్, గోపాలరావు, వి.వెంకటేశ్వరరావు, కె.పాపారావు, భక్తులు పాల్గొన్నారు.

కాంక్రీటు దిమ్మలు వేసి రహదారి దిగ్బంధం

● ఎండలో అల్లాడిన విద్యార్థులు, ప్రయాణికులు



రోడ్డుకు అడ్డంగా వేసిన కాంక్రీటు దిమ్మలు

కొల్లూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : కాంక్రీటు దిమ్మలు వేసి రోడ్డును దిగ్బంధించటంతో లాకుల వద్ద రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కొల్లూరుకు చెందిన పెగ్గెం జయరావు వెల్లటూరుకు చెందిన నర్రా గోపాలకృష్ణ వద్ద లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఇటీవల లారీ యజమాని తన మిత్రులతో కలిసి డ్రైవర్‌పై దౌర్జన్యం చేసి సెల్‌ఫోన్ లాక్కున్నారు. ఈ విషయాన్ని లారీ డ్రైవర్ తన స్నేహితులకు తెలియజేయడంతో సోమవారం మధ్యాహ్నం ఐదుగురు యువకులు డ్రైవర్‌కు మద్దతుగా లాకు సెంటర్ వద్దకు చేరుకుని రహదారిపై సిమెంట్ దిమ్మలు అడ్డుగా వేసి రాకపోకలను స్తంభింపజేశారు. ఇదేమని ప్రశ్నించిన వాహనదారులు, ప్రయాణీకులపై సైతం యువకులు దౌర్జన్యానికి దిగారు. సుమారు గంట సేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడటంతో మండుటెండలో విద్యార్థులు అల్లాడిపోయారు. సీఐ పీవీ ఆంజనేయులు సమాచారం తెలుసుకుని కొల్లూరు లాకుల వద్దకు చేరుకుని రహదారిని దిగ్బంధించిన యువకులను తీవ్రంగా మందలించి కాంక్రీటు దిమ్మలను తొలగింపజేశారు. దీంతో ఊపిరి పీల్చుకున్న వాహనదారులు తమ గమ్యస్థానాలకు చేరుకున్నారు. తన యజమానిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశాడు.

భూమి వివాదంలో పరస్పర ఘర్షణలు

బాపట్లరూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : పొలం వివాదంలో పరస్పర ఘర్షణపై బాపట్ల రూరల్ పోలీసులు కేసు నమోదు చేసిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. రూరల్ సీఐ కె.శ్రీనివాస్ తెలిపిన వివరాలు ప్రకారం బాపట్ల మండలం హైదర్‌పేట గ్రామ పరిధిలోని తూర్పు పిన్నిబోయనవారిపాలెం వెళ్ళే దారిలో ఉన్న వివాదాస్పద పొలం విషయంలో అన్నవరపు దెబోరా, తమలపాకుల ముక్కంటి ఒకరికొకరు ఘర్షణ పడి బాపట్ల ప్రభుత్వ వైద్యశాలలో చేరారు. ఇరువురు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.



ప్రజ్ఞంలో సీసీ రహదారిని ప్రారంభిస్తున్న అనగాని శివప్రసాద్

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

● అనగాని శివప్రసాద్

రేపల్లె, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్ధే కూటమిప్రభుత్వం ధ్యేయమని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. సోమవారం నిజాంపట్నం మండలం ప్రజ్ఞం, చెక్కావారిపాలెంలో సీసీ రహదారులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి అనగాని సత్యప్రసాద్ గ్రామాల అభివృద్ధికి ఒక్కొక్క పంచాయతీకి రూ.20 లక్షల నిధులు వెచ్చించి సీసీ రహదారులు అభివృద్ధి చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఒక్క గ్రామంలో కూడా రహదారులను అభివృద్ధి చేసిన పరిస్థితి లేదన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాగం కల్యాణ్, కొలసాని రాము, నల్లపాటి యల్లయ్య, దాసరి వెంకటేశ్వరరావు, బొర్రా సురేంద్ర పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల సేవలు అభినందనీయం

రేపల్లె పట్టణంలో ఆర్యవైశ్యులు చేస్తున్న సేవలు అభినందనీయమని మంత్రి సోదరుడు అనగానిశివప్రసాద్ అన్నారు. లక్ష్మీ ఎలక్ట్రానిక్స్ సమీపంలో పట్టణ ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ, మంచినీరు చలివేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వేసవిలో ఎన్నో ఏళ్ళుగా ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో చలివేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీరుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు కాళేపల్లి ఈశ్వరరావు, ఆలపాటి వేణుగోపాల్, తడికమళ్ళ బాలు, మెడికల్ మధు, కొలసాని రాము, దేవగిరి రవి తదితరులు పాల్గొన్నారు.

రామరాజ్యాన్ని తలపిస్తున్న ప్రభుత్వం

నగరం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి) : సమాజానికి శ్రీరాముడు ఆదర్శప్రాయమని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. సోమవారం కొలగానివారిపాలెం సీతారాములకల్యాణం అనంతరం ఏర్పాటు చేసిన అన్నసంతర్పణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబునాయుడు పాలన రామరాజ్యాన్ని తలపిస్తుందని తెలిపారు. ఇంటింటికి కుళాయి కార్యక్రమాన్ని త్వరలో మొదలుపెడతామన్నారు. కార్యక్ర మంలో కొలగానివారిపాలెం సర్పంచ్ భీమా శ్రీనివాసరావు, మోతీలాల్, పోతురాజు, మాజీ ఎంపీపీ విచారపు వీరయ్య, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

భవిష్యత్తు తరాలకు చేయూతనివ్వటమే జనసేన లక్ష్యం

● జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గాదె



వార్డు అధ్యక్షులకు నియామకపత్రాన్ని అందిస్తున్న వెంకటేశ్వర్లు తదితరులు

రేపల్లె, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : భవిష్యత్తు తరాల అభ్యున్నతికి కృషి చేయటమే జనసేన పార్టీ లక్ష్యమని ఉమ్మడి జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు అన్నారు. పట్టణంలోని అంకమ్మచెట్టు నుంచి సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం 2, 4, 8, 9, 10వ వార్డుల్లో నూతనంగా ఏర్పాటు చేసిన జెండాదిమ్మెను ఆవిష్కరించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో వార్డు అధ్యక్షులు కమిటీ సభ్యులతో ప్రమాణస్వీకార మహోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీ ఆవిర్భావం నుంచి ప్రజలకు అండగా నిలుస్తూ వారి అవసరాలు తీర్చే విధంగా ముందుకు వెళుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ చిలకలపూడి పాపారావు మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధిలో జనసేన పార్టీ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. జనసేనపార్టీ సీనియర్ నాయకుడు కమతం సాంబశివరావు మాట్లాడుతూ గ్రామగ్రామాన పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. జనసేన పార్టీ సీనియర్ నాయకుడు చందు సాంబశివరావు మాట్లాడుతూ జనసేన పార్టీ ఆవిర్భావం నుంచి ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొందని, అకుంటితదీక్షతో ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ రాష్ట్రంలో పార్టీ నిలదొక్కుకునేలా చేశారన్నారు.

బౌద్ధ ఆరామాలకు పూర్వ వైభవం కల్పించాలి

● ప్రభుత్వానికి విన్నవించిన బౌద్ధ బిక్షువులు



బౌద్ధ స్థూపం వద్ద ప్రార్థనలు చేస్తున్న బౌద్ధ బిక్షువులు యుషీ, బోదిహి

భట్టిప్రోలు (కొల్లూరు), ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో 40 బౌద్ధ స్థూపాలకు పూర్వ వైభవం కల్పించాలని జపాన్ బౌద్ధ బిక్షువు యుషీ, శ్రీలంక బౌద్ధ బిక్షువు బోదిహి ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం భట్టిప్రోలులోని బౌద్ధ స్థూపాన్ని బౌద్ధ బిక్షువులు సందర్శించి ప్రదక్షిణలు, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఇరువురు బౌద్ధ బిక్షువులు మాట్లాడుతూ, రాష్ట్రంలో మొత్తం 40 బౌద్ధ స్థూపాలు ఉన్నాయని, పౌర్ణమి రోజున ఒక్కో స్థూపం వద్ద దీపోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 12న పౌర్ణమి పురస్కరించుకుని దనకొండ మండ లం చందవరం స్థూపం వద్ద దీపోత్సవం చేయనున్నామని తెలిపారు. అమలాపురంలో బౌద్ధ మత వ్యాప్తి కోసం శాంతి ప్రదేశం నిర్మాణం తలపెట్టామని, హీనయాన బుద్ధిజం శాఖ నుంచి ప్రభుత్వానికి లేఖను కూడా అందించామని ప్రభుత్వం స్పందించి మూడు ఎకరాల భూమి కేటాయిస్తే నిర్మాణాలు చేపట్టనున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లు తమ అభ్యర్థనకు స్పందించి స్థల కేటాయింపులు చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీహెచ్ క్రాంతి, ఎస్.రామారావు, ప్రసన్నకుమార్, నవీన్, రాజకుమార్, నాగరాజు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

వేమూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా వేమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫేజ్-2 ద్వారా ఈ నెల 15 నుంచి డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ శిక్షణ ఇవ్వబడుతుందని కో-ఆర్డినేటర్ రాజేశ్వరి తెలిపారు. ఇందుకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. కనీసం విద్యార్హత పదవ తరగతి ఉత్తీర్ణత చెంది ఉండాలన్నారు. ఇంటర్, డిగ్రీ చదివిన వారు కూడా శిక్షణకు అర్హులన్నారు. ఉచితంగా మూడు నెలలు శిక్షణ ఇవ్వబడుతుందని, అనంతరం పరీక్షలు నిర్వహించి ఉత్తీర్ణులైన వారికి ఉద్యోగావకాశాలు కూడా కల్పించడం జరుగుతుందన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజం కోసం మరింతగా కృషి

చుండూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యవంతమైన సమాజం కోసం కృషి చేయాలని వేటపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎం.కృష్ణవేణి తెలిపారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం పీహెచ్‌సీ వద్ద జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించడంలో ఆరోగ్య సిబ్బంది అంకితభావంతో సేవలందించాలన్నారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఇందులో పీహెచ్‌సీ ఓపీ స్టాఫ్, సూపర్‌వైజరీ సిబ్బంది, సీహెచ్‌వోలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రిటైర్డ్ పోస్టుమాస్టర్ సతీష్‌బాబు మృతి

వేమూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : జంపని గ్రామానికి చెందిన రిటైర్డ్ పోస్టుమాస్టర్ గవిని సతీష్‌బాబు (68) ఆదివారం రాత్రి 3 గంటలకు గుండెపోటుతో స్వగృహంలో మృతి చెందారు. ఆయనకు భార్య ఉన్నారు. ఆయన మృతికి పోస్టల్ శాఖ ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, టీడీపీ నాయకులు, ఆర్యవైశ్య సంఘ నాయకులు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.


ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న ఈవో తిమ్మానాయుడు, శంకరరెడ్డి

నేడు శింగరకొండలో ధ్వజ స్తంభం తొలగింపు

» ప్రారంభమైన పూజలు

అద్దంకి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో కొత్త ధ్వజ స్తంభం ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. సుమారు 4 దశాబ్దాల కిందట పీడీసీసీ బ్యాంక్ మాజీ ఛైర్మన్ మేదరమెట్ల శంకరారెడ్డి ధ్వజ స్తంభం ఏర్పాటుకు సహకారం అందించారు. ప్రస్తుతం సుమారు రూ.7 కోట్లతో రాతి ముఖ మండప నిర్మాణం జరుగుతుండడంతో అదే సమయంలో ఇప్పటికే దెబ్బతిన్న ధ్వజ స్తంభం స్థానంలో కొత్తదానిని ఏర్పాటుకు సిద్ధమయ్యారు. అప్పటి దాత శంకరారెడ్డి మరలా ధ్వజ స్తంభం ఏర్పాటుకు అవసరమయ్యే ఖర్చు భరించేందుకు సిద్ధం అయ్యారు. దీంతో మంగళవారం ఉదయం రెవెన్యూ అధికారుల సమక్షంలో పంచనామా నిర్వహించి తొలగించనున్నట్లు ఈవో తిమ్మానాయుడు తెలిపారు. ధ్వజ స్తంభం తొలగింపునకు సంబంధించి పూజా కార్యక్రమాలను సోమవారం ఈవో తిమ్మానాయుడు, ధ్వజ స్తంభం దాత మేదరమెట్ల శంకరారెడ్డి, కుమారుడు రాజశేఖరరెడ్డి దంపతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యుడు సందిరెడ్డి శ్రీనివాసరావు, పీడీసీసీ మాజీ బ్యాంక్ డైరెక్టర్ రమేష్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు సర్వసభ్య సమావేశం

కారంచేడు(పర్చూరు), ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : కారంచేడు మండల సర్వసభ్య సమావేశం 9న ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ వాసుబాబు అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో నేతాజీ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఎంపీటీసీలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.


ప్రధాన రోడ్డు వెంబడి ఉన్న బ్యాంకుల ఎదుట సర్వీస్ రోడ్డుపై నిలిపిన వాహనాలు


ఆర్టీసీ పక్క రోడ్డులో పరిస్థితి ఇలా

సర్వీస్ రోడ్డే పార్కింగ్

» ప్రధాన రోడ్డులో బహుళ అంతస్తులకు లేని ఖాళీ స్థలాలు
» బ్యాంకులు, వ్యాపార సంస్థలన్నీ అక్కడే
» ఎక్కడికక్కడ వాహనాల నిలిపివేత
» పాదచారులు, ఇతర ప్రయాణికులకు ఇబ్బందులు

అద్దంకిటౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రధాన రోడ్డు వెంట బహుళ అంతస్తులను పార్కింగ్ స్థలా లు లేకుండా వివిధ సంస్థలకు, వ్యాపారాలకు అద్దెలకు ఇవ్వడంతో ఆయా సంస్థల వద్దకు, వ్యాపార సముదాయాల వద్దకు వచ్చే వాహనాలకు సర్వీస్ రోడ్డు పార్కింగ్ స్థలంగా మారింది. దీంతో కనీసం పాదచారులు, ఇతర వాహనాలు ఈ రోడ్డున రాకపోకలు సాగించాలంటే తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అద్దంకిలోని ప్రధాన రోడ్డు వెంబడి ఉండే బహుళ అంతస్తుల బిల్డింగ్‌లను ఎక్కువగా పలు ప్రధాన బ్యాంక్‌లు, ఇతర వ్యాపార సంస్థలు అద్దెలకు తీసుకుంటున్నాయి. అయితే ఆ బిల్డింగ్‌లకు పార్కింగ్ స్థలాలు లేవు. దీంతో అక్కడకు వచ్చే ఖాతాదారులకు, వినియోదారులకు పార్కింగ్ స్థలం లేక పాదచారులు, ఇతర వాహనాలు వెళ్లే సర్వీస్ రోడ్డే ఆయా సంస్థలకు పార్కింగ్ స్థలంగా మారింది. నిత్యం రద్దీగా ఉండే ఆ ప్రాంతాలలో సర్వీస్ రోడ్డుపై వాహనాలు గంటల తరబడి నిలిచి ఉండడంతో కనీసం సర్వీస్ రోడ్డులో పాదచారులు, ఇతర వాహనాలు వెళ్లాలంటే ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రధాన రోడ్డు వెంబడి ఉన్న సర్వీస్ రోడ్డుతో పాటు మున్సిపాలిటీ కార్యాలయం రోడ్డు, బంగ్లా రోడ్డు, ఆర్టీసీ పక్కరోడ్డు, గీతామందిర్ రోడ్డుతో పాటు పలు రోడ్డులలో పాదచారులకు, ఇతర వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. వ్యాపార సంస్థలుగా అద్దెకు భవనాలు తీసుకునే క్రమంలో అక్కడికి వచ్చే వారికి పార్కింగ్ స్థలం అనేది లేకుండా ఇలా సర్వీస్ రోడ్డుపైనే, లేక రోడ్డు వెంబడి వాహనాలు నిలిపి రాకపోకులకు ఇబ్బంది కలిగించడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి సర్వీస్ రోడ్డులో, ప్రధాన రోడ్డులలో వాహనాల పార్కింగ్ విషయంలో తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి

ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : అందరు పగలు, ప్రతీకారాలు విడనాడి ఆధ్యాత్మిక చింతన కలిగి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. సోమవారం ఈపూరుపాలెం పద్మనాభునిపేట, దేశాయిపేటలోని విఘ్నేశ్వర కాలనీ, రామన్నపేట, కఠారిపాలెంలోని సీతారామ దేవాలయంలో ప్రత్యేక పూజలకు హాజరయ్యారు. ఆయా ప్రాంతాల్లో శ్రీరామ నవమి పందిళ్ల వద్ద కమిటీ ప్రతినిధులు నిర్వహించిన అన్నసంతర్పణ కార్యక్రమాలను ప్రారంభించారు. ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామి తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కొండయ్య


గరటయ్య కాలనీలో మంచినీటి సరఫరాపై స్థానికులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రవీంద్ర

తాగునీటి సమస్య లేకుండా చర్యలు

అద్దంకి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి పట్టణంలోని శివారు కాలనీలలో ఎలాంటి తాగునీటి సమస్య తలెత్తకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకున్నట్లు మున్సిపల్ కమిషనర్ రవీంద్ర అన్నారు. పట్టణంలోని టైలర్స్ కాలనీ, కలవకూరు రోడ్డు, గరటయ్య కాలనీ తదితర ప్రాంతాలలో సోమవారం పర్యటించి స్థానికులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. పారిశుధ్య పనులు గురించి అడిగారు. అనంతరం అన్నా క్యాంటీన్‌ను పరిశీలించారు.

రూ.6.71లక్షలు పలికిన పూజల వేలం

బల్లికురవ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : వీర్ల గంగమ్మ తల్లి దేవాలయ వద్ద ఏడాది పాటు పూజలు నిర్వహించి అందులో వచ్చే ఆదాయం పొందేందుకు ఆదివారం రాత్రి నక్కబొక్కలపాడులో వేలం పాటను గ్రామ పెద్దలు నిర్వహించారు. ఈ సందర్భంగా అదే గ్రామానికి చెందిన చల్లగుండ్ల శ్రీనివాసరావు అను భక్తుడు రూ.6.71 లక్షలకు వేలం పాట పాడారు. గత ఏడాది ఆలయానికి రూ.4.81లక్షలు పలికింది. ఈ ఏడాది వేలం పాట ద్వారా అమ్మవారికి ఆదాయం పెరిగిందని గ్రామ పెద్దలు తెలిపారు. వచ్చిన ఆదాయంతో ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు.

ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన నాగరాజు


బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్ఐ నాగరాజు

బల్లికురవ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ఎస్‌గా వై.నాగరాజు సోమవారం బాధ్యతలను స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేస్తున్న జీవీ చౌదరి జిల్లా కేంద్రానికి బదిలీ కాగా, వీఆర్‌లో ఉన్న నాగరాజును బల్లికురవకు నియమించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ శాంతి భద్రతలకు ఎలాంటి సమస్య రాకుండా పని చేస్తానన్నారు. ఎవరైనా చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన అనుభవంతో ప్రజలతో కలిసి ముందుకు పోతామన్నారు. ఈసందర్భంగా ఎస్ఐని స్టేషన్ సిబ్బంది, టీడీపీ నేతలు మలినేని గోవిందరావు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రతి మూడు రోజులకోసారి చెత్త సేకరణ

అద్దంకిటౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ఎంపిక చేసిన గ్రామాలల్లో ప్రతి రెండు, మూడు రోజులకు ఒకసారి ఇంటింటికీ చెత్త సేకరణ కార్యక్రమం కచ్చితంగా చేపట్టాలని ఈవోపీఆర్డీ ఆర్‌వీఎస్ ప్రసాదరావు అన్నారు. సోమవారం డోర్ టు డోర్ చెత్త సేకరణ కార్యక్రమంలో భాగంగా ఎంపిక చేసిన 6 గ్రామాలల్లో ఐవీఆర్ఎస్ కాల్స్ వచ్చే క్రమంలో ఆయా గ్రామాలను ఈవోపీఆర్డీ ప్రసాదరావు సందర్శించారు. అలాగే చెత్త సేకరణ షెడ్ల వద్ద తొట్టెలను, వర్మీ కంపోస్ట్ పిట్స్‌ను పరిశీలించి అన్నింటినీ ఉపయోగింగంలోకి తేవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు, గ్రామ టీడీపీ నేతలు గోగులమూడి రాజశేఖర్, హిరతరాయబారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

కమిషనర్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న చైర్మన్ జంజనం, వైస్ చైర్మన్ బొనిగల, వైసీపీ కౌన్సిలర్‌లు

చీరాల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : కమిషనర్ తీరు సక్రమంగా లేదని మునిసిపల్ ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ ఛైర్మన్ బొనిగల జైసన్‌బాబు అన్నారు. సోమవారం కలెక్టర్ వెంకట మురళిని కలిసి కౌన్సిలర్లు, నాయకులతో కలిసి ఛైర్మన్ ఫిర్యాదు చేశారు. ఇటీవల బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి రోజున చోటుచేసుకున్న వివాదంతోపాటు పలు విషయాలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. అయితే దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వారికి హామీ ఇచ్చారు.

'మీకోసం'కు 9 దరఖాస్తులు

పంగులూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం జరిగిన మీ కోసంలో 9 దరఖాస్తులు అందాయని తహసీల్దార్ పి.సింగారావు తెలిపారు. భూమి కొలతలకు సంబంధించి 7, ఒన్ ఏ కోరుతూ 1, భూమి కోరుతూ 1 దరఖాస్తు అందినట్లు తెలిపారు.

కారంచేడులో జూదరుల అరెస్టు

కారంచేడు(పర్చూరు), ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : కారంచేడు గ్రామ శివారులో పేకాట స్థావరంపై ఎస్ఐ వెంకట్రావు ఆదివారం రాత్రి దాడి నిర్వహించారు. ఈదాడిలో పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసి, రూ.27వేలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తికి తీవ్రగాయాలు

నూతలపాడు(పర్చూరు), ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన సోమవారం సాయంత్రం పాత మద్రాసు రోడ్డులోని నూతపాడు నక్కవాగు సమీపంలో జరిగింది. నూతలపాడు గ్రామానికి చెందిన మార్కు సంగీతరావు తన ద్విచక్రవాహనంపై పర్చూరు నుంచి నూతలపాడు వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. గాయపడిన సంగీతరావును 108 లో ప్రభుత్వాసుపత్రికి, అనంతరం గుంటూరుకు తరలించారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

సంతమాగులూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : విద్యతోనే పిల్లలకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని హెచ్‌ఎం విజయలక్ష్మి తెలిపారు. సోమవారం ఏల్చూరులో పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలంటూ తల్లిదండ్రులను కలిసి కోరారు.

వచ్చేనెల 27న నాంచారమ్మ తిరునాళ్ల

పర్చూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : పర్చూరులోని గ్రామ దేవత శ్రీ అద్దంకి నాంచారమ్మ అమ్మవారి తిరునాళ్ల నిర్వహణపై ఆలయ కార్యనిర్వాహక కార్యదర్శి దామా నాగేశ్వరరావు నేతృత్వంలో వంశపారంపర్య అర్చకులు సోమవారం సమావేశం నిర్వహించారు. స్వామివారి తిరునాళ్ల, సిడిమహోత్సవం ఏర్పాటుపై చర్చించిన అనంతరం మే 27న అమ్మవారి తిరునాళ్లకు తేదీని ఖరారు చేసినట్లు ఈవో తెలిపారు.

మార్కెట్ కమిటీ ఛైర్మన్ రమేష్‌కు సన్మానం

సంతమాగులూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రప్రదేశ్) : మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా నియమితులైన తేలప్రోలు రమేష్‌కు సోమవారం మండల పరిషత్ సిబ్బంది ఎంపీడీవో హాలులో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జ్యోతిర్మయి, ఈవోపీఆర్డీ శివరాం ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు. కాగా బాధ్యతలు స్వీకరించిన రమేష్ మండల నాయకులతో కలసి మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. రైతులకు మెరుగైన సేవలు అందించాలని మంత్రి గొట్టిపాటి సూచించారు.


చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎంపీడీవో స్వరూపారాణి

చలివేంద్రాల ఏర్పాటు

పంగులూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : పంగులూరులోని ప్రధాన కూడళ్లలో సోమవారం మూడు చలివేంద్రాలను ఎంపీడీవో స్వరూపారాణి ప్రారంభించారు. బస్ స్టాండ్ సెంటర్‌తో పాటు శేణుగోపాలస్వామి ఆలయం, మరో బస్ షెల్టర్ వద్ద వేసవిని దృష్టిలో పెట్టుకొని గ్రామ పంచాయతీ వారు ప్రజల దాహార్తిని తీర్చేందుకు వీటిని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సుమంత్, టీడీపీ నేతలు మేడ సుబ్బారావు, చిలుకూరి కోటయ్య, గుడిపూడి రామారావు, పంచాయతీ కార్యదర్శి రాంబాబు, సంధ్య, పలువురు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వడగాలులపై జాగ్రత్తలు పాటించండి

తహసీల్దార్ గోపీకృష్ణ

చీరాల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ఎండలు ముదురుతున్న నేపథ్యంలో వేడి గాలుల ప్రభావం నుంచి జాగ్రత్తలు పాటించాలని తహసీల్దార్ గోపీకృష్ణ పేర్కొన్నారు. సోమవారం కార్యాలయం ప్రాంగణంలో ప్రజలకు తాగునీరు అందుబాటులో ఉంచేందుకు చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. వేడి గాలుల తీవ్రతను సిబ్బందికి వివరించి, తీసుకోవలసిన జాగ్రత్తలను తెలిపారు. కార్యక్రమంలో పలువురు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నీటి తొట్టెలను వినియోగించుకోవాలి

అద్దంకిటౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో పొలాలకు తోలుకు వెళ్లే పశువులకు వేసవి తాపం లేకుండా ఏర్పాటు చేస్తున్న నీటి తొట్టెలను పశు పోషకులు, గొర్రెల కాపరులు వినియోగించుకోవాలని ఒంగోలు పశు సంవర్ధకశాఖ ఉప సంచాలకులు డాక్టర్ ఏ.రమేష్‌బాబు అన్నారు. సోమవారం మండలంలోని తిమ్మయపాలెం, బొమ్మనంపాడు గ్రామాల పరిధిలో ఏర్పాటు చేస్తున్న నీటి కుంటలను అద్దంకి పశు వైద్యశాల ఏడీ డాక్టర్ ఎం.మోహనరావు, బొమ్మనంపాడు పశువైద్యాశాల వైద్యులు డాక్టర్ అశోక్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మండలంలో ఏఏ గ్రామాలలో నీటి కుంటల ఏర్పాటు జరుగుతుంది, ప్రస్తుతం అవి ఏఏ దశలలో ఉన్నాయో అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మండలంలోని వెంపరాల, కోటిలపూడి, కుంకుపాడు, మోదేపల్లి గ్రామాలల్లో మొదటి విడతగా మొత్తం 5 నీటి కుంటలు మంజూరయ్యాయని తెలిపారు. 75 శాతం సబ్సిడీ కింద గడ్డి విత్తనాలను అందజేయడం జరుగుతుందని రైతులు సద్వినియోగపర్చుకోవాలని తెలిపారు. ప్రభుత్వం అందించే సబ్సిడీలు, పథకాలను సద్వినియోగపర్చుకోవలని కోరారు. కార్యక్రమంలో పశు వైద్యశాల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అమరావతికి బస్సు సౌకర్యం కల్పించండి

చీరాల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : చీరాల నుంచి అమరావతి సచివాలయం, హైకోర్టుకు తదితర పనుల నిమిత్తం రాజధానికి వెళ్లేందుకు బస్సు సౌకర్యం కల్పించాలని పేరాల నేతాజీ సేవా సమితి ప్రతినిధులు కోరారు. సోమవారం ఆర్టీసీ డీఎం శ్యామలను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికే ఎమ్మెల్యే కొండయ్య దృష్టికి కూడా సమస్యను తీసుకువెళ్లినట్లు చెప్పారు. నేరుగా బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రయాణానికి అవస్థలు పడుతున్నట్లు చెప్పారు. దీనిపై అధికారులు సానుకూలంగానే స్పందించారు. కార్యక్రమంలో రామారావు, కృష్ణమూర్తి, నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, శ్రీధర్ పాల్గొన్నారు.


ఆర్టీసీ డీఎం శ్యామలకు వినతిపత్రం అందజేస్తున్న ప్రతినిధులు

ఎమ్మెల్యే గారూ.. మా సమస్యలు పట్టించుకోరూ..!

» అధ్వానంగా తాగునీటి పైపులు
» దెబ్బతింటున్న అంతర్గత రహదారులు
» ఇదీ ముత్యాలపేటలో పరిస్థితి


రోజూ వ్యాపార కార్యకలాపాలు సాగించే చిన్న రోడ్డు

చీరాల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : పురపాలక సంఘం పరిధిలోని 14వ వార్డు ముత్యాల పేటలో కరూర్ వైశ్యాబ్యాంక్ నుంచి మొదలుకుని అధిక శాతం అంతర్గత రహదారులు, డ్రెయిన్‌లు ఘోరంగా ఉన్నాయి. ముఖ్యంగా బ్యాంకు వెనుక రహదారిలో తాగునీటిపైపులు సైతం రోడ్డుపైనే నడిపించడంతో అవి ఎప్పుడు పగలిపోతాయే అర్థం కాని పరిస్థితి. గతంలో తాగునీరు అందించేందుకు రోడ్లను ఇష్టారీతిగా అడ్డంగా పగలకొట్టి విద్యుత్ వైర్లకు అమర్చే పైపులు వేసి తాగునీటి సౌకర్యం కల్పించారు. మరోవైపు ఆ మా ర్గంలో కొంతమంది రహదారులను ఆక్రమించి దుకాణాలకు సంబంధించి కార్యకలాపాలు సాగిస్తున్నారు. పైగా అధిక లోడుతో వచ్చే చిన్న వాహనాల వల్ల తాగునీటి పైపులు దెబ్బతినే పరిస్థితి ఉంది. కొందరు వ్యాపారాల వ్యర్థాలను కాలువల్లో పడేస్తుండడంతో పారిశుధ్యం క్షీణించింది. దీంతో దోమలు విజృంభించి ప్రజల కంటి మీద కునుకులేకుండా చేఉస్తున్నాయి. పాలకులు వార్డు సమస్యలపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.


డ్రెయిన్‌పై అస్తవ్యస్తంగా ఉన్న తాగునీటి పైపులు

కమ్యూనిటీ హాల్స్ నిర్మాణానికి రూ.2.30కోట్లు మంజూరు

అద్దంకి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని 7 గ్రామాలలో కొత్తగా కమ్యూనిటీ హాల్స్ నిర్మాణానికి రూ.2.30కోట్ల నిధులు మంజూరైనట్లు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ప్రాసంగులపాడు, పమిడిపాడు, కుంకుపాడు, మోదేపల్లి, బూదవాడ, కొమ్మినేనివారిపాలెంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్స్, కొమ్మాలపాడులో కాపు సామాజికవర్గానికి కమ్యూనిటీ హాల్స్ మంజూరైనట్లు తెలిపారు.

పున్నారెడ్డికి మంత్రి గొట్టిపాటి పరామర్శ


పున్నారెడ్డిని పరామర్శిస్తున్న మంత్రి గొట్టిపాటి

మేదరమెట్ల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తూర్పుపాలెంకు చెందిన టీడీపీ నాయకుడు కనుబొద్ది పున్నారెడ్డి భార్య పున్నమ్మ గుండె సమస్యతో మరణించారు. సోమవారం విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తూర్పుపాలెంలోని పున్నారెడ్డి నివాసానికి వెళ్లి పున్నమ్మ మృతికి కారణాలను అడిగి తెలుసుకొని కుటుం సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయన వెంట టీడీపీ నాయకులు భవానీప్రసాదరెడ్డి, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం


డాక్టర్ బాబూరావును సత్కరిస్తున్న ప్రతినిధులు

చీరాల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : రోటరీక్లబ్ హాలులో వాకర్స్ అసోసియేషన్, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సోమారం ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా మారుతు న్న కాలానుగుణంగా తీసుకోవాల్సిన జాగ్ర త్తలు డా.ఐ.బాబూరావు వివరించారు. షుగర్, గుండె సంబంధిత వ్యాధులపై అవగాహన కల్పించారు. ధూమపానం, మద్యపానం వంటి వాటికి దూరంగా ఉండడంతోపాటు పౌష్టిక ఆహారం, వ్యాయామంతో ఆరోగ్యవంతులుగా ఉండవచ్చని సూచించారు. అనంతరం ప్రతినిధులు డా.బాబూరావును సత్కరించారు. కార్యక్రమంలో రామకృష్ణ, వెంకటేశ్వరరావు, నారాయణమూర్తి, సురే ష్, వీరాంజనేయులు,బదిరి, తిరుపతిరావు పాల్గొన్నారు.

పంగులూరు: పాఠశాల స్థాయి నుంచి బాల బాలికలు ఆరోగ్యంగా ఉండేందుకు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి బాల రాజేశ్వరి సూచించారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా రామకూరు ప్రాథమికోన్నత పాఠశాల బాల బాలికలకు సోమవారం ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సంపూర్ణ ఆరోగ్యం కోసం పాలు, గుడ్లు, పండ్లు, ఆకు కూరలు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. శారీరక, మానసిక ఆరోగ్యం కోసం యోగాసనాలు, వాకింగ్‌తో పాటు శరీరానికి సరిపడా నీరు తీసుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని, పాలు, గుడ్లు తీసుకోవాన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీమన్నారాయణ, సూపర్‌వైజర్ హరిబాబు, ఏఎన్‌ఎం శ్రావణి, ఆశాలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వర్ణ (పర్చూరు) : కారంచేడు మండలం స్వర్ణలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఆధ్వర్యంలో సో మవారం ఆరోగ్య దినోత్సవ ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ శాలిని ప్రజలకు ఆరోగ్య సమస్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.